RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,
సంపుటి: 16 సంచిక : 40 మంగళవారం 19. 5. 2026 ఎడిటర్ : జేరిపోతుల సంపత్ పేజీలు : 8 వెల: 2.00

తెలంగాణ వాణి
విలేకరులు కావలెను
తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
9182328292

## హైదరాబాద్‌లో హైటెక్ మాల్‌ప్రాక్టీస్.. 12 మంది అరెస్టు

నగరంలోని మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో హైటెక్ మాల్‌ప్రాక్టీస్ రాకెట్‌ను నాచారం పోలీసులు ఛేదించారు. సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ మల్టీటాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగ నియామక పరీక్షలో ఉల్లంఘనలకు పాల్పడినట్లు గుర్తించారు. అత్యాధునిక రహస్య ఎలక్ట్రానిక్ పరికరాల సహాయంతో పరీక్షలో అక్రమాలకు పాల్పడుతున్న 12 మంది అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

## హరీష్ రావు బీజేపీ వైపు చూస్తున్నారు: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

హైదరాబాద్ తెలంగాణ వాణి)
కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని.. మొదట మీ పార్టీ ఉంటుందో లేదో ఆయన చూసుకోవాలని శాసనమండలి ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ హితవు పలికారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఉంటే, అందులో జగదీష్ రెడ్డిది హరీష్ రావు వర్గమా లేక కేటీఆర్ వర్గమా అనేది ముందు తేల్చుకోవాలని, ఆ పార్టీలోనే మూడు ముక్కలాట జరుగుతోందని ఎద్దేవా చేశారు. కవిత వెళ్లిపోయిన తర్వాత కేసీఆర్, కేటీఆర్ ఒక వైపు.. హరీష్ రావు బీజేపీ వైపు ఉన్నట్లుగా తెలుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ పేరుతో మళ్లీ పార్టీ పెట్టుకోవాలనే ఆలోచనపై మీ దగ్గర సమాధానం లేదని.. అసలు మీ పార్టీ అంటే ఏ పార్టీ? బీఆర్ఎస్సా, టీఆర్ఎస్సా అని అద్దంకి దయాకర్ నిలదీశారు. హరీష్ రావు మీ పార్టీలోనే ఉంటూ బీజేపీతో కలవడానికి ప్రయత్నం చేస్తున్నారని.. మీ చుట్టూ ఆయన తవ్వుతున్న గుంతల గురించి మీకు తెలియదా? అని ప్రశ్నించారు. పార్టీని మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తూ మీరే మల్లగుల్లాలు పడుతున్నారని, తీవ్ర గందరగోళంలో ఉన్నారని ఆయన విమర్శలు గుప్పించారు.

## ప్రేమ పేరుతో మైనర్ పై దారుణం..

ప్రేమ పేరుతో నమ్మించి ఓ మైనర్ బాలిక పై లైంగిక దాడికి పాల్పడిన ఘటన తాండూరు రూరల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్రాస్‌పేట్ మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలిక ప్రస్తుతం తాండూరు పట్టణంలో నివాసం ఉంటోంది. ఆమెకు బంధువైన గౌతాపూర్ గ్రామ నివాసి శివకుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో శివకుమార్ సదరు బాలికను ప్రేమిస్తున్నానని, పెద్దలను ఒప్పించి ఖచ్చితంగా పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఆ నమ్మకంతో బాలిక పై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి లోబరుచుకున్నాడు.ఇటీవలే సదరు మైనర్ బాలిక గర్భవతి కావడంతో కుటుంబ సభ్యులు గమనించి ప్రశ్నించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తన కుమార్తె శివకుమార్ చేతిలో మోసపోయానని గ్రహించిన మైనర్ బాలిక తల్లి ఆదివారం రాత్రి తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు పై తాండూరు పట్టణ పోలీసులు తక్షణమే స్పందించారు.

# తమిళనాడు 'ఈ-గవర్నెన్స్' మోడల్‌ను స్టడీ చేయండి..

## అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్రం కీలక సూచన

హైదరాబాద్ తెలంగాణ వాణి)
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'సింపుల్ ఈ-గవర్నెన్స్' ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టి.వి. సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను కోరారు. సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడుతూ.. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న సింపుల్ ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అధ్యయనం చేయాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు మరింత సరళతరమైన, మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని సూచించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణా రావు తెలంగాణలో అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాలను వివరించారు. ప్రజలకు పారదర్శకంగా, సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని.. ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్‌లైన్ డ్యాష్ బోర్డుల ద్వారా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. మున్సిపల్, పరిశ్రమలు, విద్య, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా అందిస్తున్న సేవలను ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణలో సాగుతున్న ఈ-గవర్నెన్స్ విధానాలపై స్పందించిన టి.వి. సోమనాథన్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను అభినందించారు.

ఈ సందర్భంగా సీఎస్ కే. రామకృష్ణా రావు మాట్లాడుతూ.. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కూడా అధ్యయనం చేసి, ప్రజలకు ఎలాంటి ఆర్థిక భారం,



ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో అవసరమైన మార్పులు చేస్తామన్నారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శులు యోగితా రాణా, షికా గోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ. శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎండీ. వీ.పీ. గౌతమ్, సెర్ప్ సీఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

# రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు

ఢిల్లీ (తెలంగాణ వాణి)
దేశీయ ఇంధన అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగానే ముడి చమురు దిగుమతులు ఉంటాయని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అమెరికా ఆంక్షల సడలింపు ఉన్నా, లేకపోయినా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగుతాయని స్పష్టం చేసింది. రష్యా పెట్రోలియం ఉత్పత్తులపై అమెరికా ఆంక్షల మినహాయింపు గడువు ముగిసిన నేపథ్యంలో కేంద్రం దీనిపై తాజాగా స్పందించింది.
"రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు కూడా భారత్ అక్కడి నుంచి కొనుగోలు చేసింది. ఆంక్షలను సడలించినప్పుడూ మాస్కో నుంచి చమురు దిగమతి చేసుకున్నాం. ఇప్పుడు కూడా ఆ కొనుగోళ్లు కొనసాగుతాయి. చమురు ఏ దేశం నుంచి కొనాలనేది పూర్తిగా మన వాణిజ్య ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల అమెరికా ఆంక్షల సడలింపు ఉన్నా.. లేకపోయినా మనకు ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడదు" అని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ సోమవారం వెల్లడించారు. అలాగే, దేశంలో ముడిచమురు



కొరత లేదని ఆమె స్పష్టం చేశారు.
ఇరాన్ (×తీ్ఘఅ)తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగిన వేళ.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు భారత్ సహా ప్రపంచ దేశాలకు అనుమతిస్తూ అమెరికా ఆంక్షలు సడలించిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పటికే సముద్రంలో ఉన్న రష్యా చమురు నౌకల నుంచి మాత్రమే ఈ కొనుగోళ్లు జరపాలని గతంలో వెల్లడించింది. ఆ గడువు మే 17తో ముగిసిన నేపథ్యంలో.. దేశంలో చమురు కొరతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా స్పష్టతనిచ్చింది. మే నెలలో ఇప్పటివరకు రష్యా నుంచి భారత్ సగటున రోజుకు 23 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకున్నట్లు కెప్లెర్ డేటా పేర్కొంది.

# నెలరోజులు టీఆర్ఎస్ జెండా పండుగ

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

హైదరాబాద్ తెలంగాణ వాణి)
రాష్ట్ర వ్యాప్తంగా ఒకే మోడల్‌లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నట్లు పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం స్టేట్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా గద్దెల మోడల్‌ను ఆవిష్కరించారు. మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని కవిత సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని.. పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు.జెండా గద్దె బేస్‌కు గ్రీన్ కలర్.. పైభాగంలో ఉండే జెండా గద్దెకు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్‌లో



ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లిష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. పార్టీ జెండా కలర్ కోడ్స్ సైతం తాము ఇచ్చిన విధంగానే చూసుకోవాలని.. అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉంటాయని వెల్లడించారు. కాగా.. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

## తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులకు అరుదైన గౌరవం...

హైదరాబాద్ తెలంగాణ వాణి)
దేశం నుంచి నక్సలిజం పూర్తిగా రూపుమాపుతామన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం సాకారమవుతోంది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చడంలో అసాధారణ సేవలందించిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులకు అరుదైన గౌరవం దక్కింది. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో జరిగిన



కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. తెలంగాణ పోలీసు అధికారులను ఘనంగా సత్కరించారు. ఇదే వేదిక పైనుంచి దశాబ్దాలుగా మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా అమిత్ షా అధికారికంగా ప్రకటించారు.

**తెలంగాణ పోలీసులకు అరుదైన గుర్తింపు..**

తెలంగాణలో నక్సల్స్ ఏరివేతలో, మావోయిస్టు ఉద్యమాన్ని పూర్తిగా అణచివేయడంలో అహర్నిశలు శ్రమించిన అధికారులను కేంద్ర హోంమంత్రి వేదికపై ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్, స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్ బి. శివధర్ రెడ్డి, ఆపరేషన్స్,ఆక్టోపస్ గ్రేహౌండ్స్ డీజీ డాక్టర్ అనిల్ కుమార్, మల్కాజిగిరి సీపీ, మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా ఘనంగా సత్కరించారు. వామపక్ష తీవ్రవాదంపై వారు చేసిన రాజీలేని పోరాటాన్ని, అంకితభావాన్ని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

# కేటీఆర్ అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దు..

## బీజేపీ నేత ఎన్. రాంచందర్ రావు

హైదరాబాద్ తెలంగాణ వాణి)
రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ వంటి పార్టీల వైఖరితో రాజకీయ పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని, ఆ పార్టీ నాయకులు తమ పార్టీని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసం ఒక వ్యక్తిని, వారి కుటుంబాన్ని టార్గెట్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారం, అనుకూల మీడియా ద్వారా తమ పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం కేటీఆర్ చేస్తున్నారని ఆరోపించారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టప్రకారం చర్యలు తప్పవని.. ఒకవేళ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తప్పు చేసి ఉంటే పార్టీ కూడా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కానీ ఇక్కడ జరిగింది ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన విషయం మాత్రమేనని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులు తప్పు చేసి ఉంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కోర్టులు నిర్ణయం తీసుకుంటాయని చెప్పారు. చట్టపరమైన హక్కుల ప్రకారం ఎవరైనా ముందస్తు బెయిల్ (ూత్ఱఎఱజూశీతీఎ దీుఅశ్రీ) తీసుకోవచ్చని, అది పారిపోవడం కాదని, చట్టంలో ఉన్న హక్కును



వినియోగించుకోవడమేనని పేర్కొన్నారు.
ముందు బీఆర్ఎస్ నాయకులు తమ పాలనలో జరిగిన ఘటనలకు సమాధానం చెప్పాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలు, అవినీతి అంశాలపై విచారణలు ప్రారంభమయ్యాక కోర్టులను ఆశ్రయించిన వారు, ఇప్పుడు నైతికత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో మహిళలపై నేరాలు భారీగా జరిగాయని ఆరోపించారు. ఎన్సీఆర్బీ (చీజ=దీ) గణాంకాల ప్రకారం.. 2014లో తెలంగాణలో మహిళలపై నమోదైన కేసులు 14,147 ఉండగా, 2023 నాటికి అవి 23,679కి చేరాయని గుర్తుచేశారు. అంటే మహిళలపై నేరాలు సుమారు 67 శాతం పెరిగాయని, దీనికి సమాధానం చెప్పాల్సింది బీఆర్ఎస్ నాయకత్వమేనని ప్రశ్నించారు. ఇంతటి దారుణ చరిత్ర బీఆర్ఎస్ ట్రాక్ రికార్డులో ఉన్నప్పుడు, ఇప్పుడు మహిళల హక్కులు, మైనర్ల భద్రత గురించి మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీకి లేదన్నారు. ఆనాటి ఘటనల సమయంలో కేసీఆర్ రాజీనామా చేశారా, లేక కేటీఆర్ బాధ్యత తీసుకున్నారా? ఎవరైనా నైతిక బాధ్యత వహించారా? అని నిలదీశారు. ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీపై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.
కేటీఆర్ కుటుంబ సభ్యులపై వచ్చిన లిక్కర్ స్కామ్ ఆరోపణల సమయంలో కూడా బీఆర్ఎస్ నాయకత్వం రాజీనామాలు చేయలేదని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం తమ పార్టీపై అబద్ధపు ప్రచారం చేస్తూ అభాండాలు వేస్తున్నారన్నారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను తిరస్కరించారని చెప్పారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ-రేస్ వంటి అంశాల్లో ఇరుక్కుపోతామనే భయంతోనే కేటీఆర్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు బీజేపీపై విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం 'ఆత్మనిర్భర్ భారత్', 'వికసిత భారత్' లక్ష్యాల దిశగా ముందుకు సాగుతోందని, పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని ఆయన సూచించారు.

# కేంద్రానివి 'రైతు వ్యతిరేక' విధానాలు.. మంత్రి తుమ్మల ఫైర్

హైదరాబాద్ తెలంగాణ వాణి)
కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై అవలంబిస్తున్న విధానాలు రైతులకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించడంలో విఫలమవుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర, మార్కెట్ భరోసా, దిగుమతుల నుంచి రక్షణ, ఉత్పత్తి వ్యయాల నియంత్రణ వంటి అంశాల్లో కేంద్రం సమగ్ర వ్యూహంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.
సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు పదేపదే "కేంద్రమే ధాన్యమంతా సేకరిస్తోంది, అందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్రమే భరిస్తోంది" అని ప్రచారం చేయడం వాస్తవ పరిస్థితులను వక్రీకరించడమేనని మండిపడ్డారు. రైతుల సమస్యలను ఒక్క వరి ధాన్యానికి మాత్రమే పరిమితం చేయడం సరైంది కాదని.. వరితో పాటు మొక్కజొన్న, జొన్న, కందులు, పెసలు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పత్తి, ఆయిల్‌పామ్ వంటి అనేక పంటలు రాష్ట్రంలో విస్తృతంగా సాగవుతున్నాయని తెలిపారు. ఈ పంటల కొనుగోళ్లు, మద్దతు ధరలు, దిగుమతి-ఎగుమతి విధానాలు, ఎరువుల ధరలు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు.
వరి ధాన్యం విషయంలో కూడా ఎఫ్‌సీఐ పూర్తి పంటను కొనుగోలు చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. కేంద్రం వరి ధాన్యానికి క్వింటాకు రూ. 2,300 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం అదనంగా క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రులు ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. రైతు ఆదాయాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని చిన్నచూపు చూడడం



బాధాకరమన్నారు. రైతులకు నిజమైన భరోసా కల్పిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

## ఆశా వర్కర్ల హామీలు వెంటనే అమలు చేయాలి

**ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్**



**నిర్మల్ - భైంసా:మే18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ముధోల్ నియోజక వర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నివాసంలో ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో ఆశా వర్కర్లు కీలక సేవలు అందిస్తున్నారని అన్నారు.వారికి వేతనాల పెంపుతో పాటు పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

## ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ మారథాన్‌కు భారీ స్పందన

- ప్రతి ఒక్కరూ శారీరకంగా ఫిట్‌గా ఉండాలి:
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- ఉత్సాహంగా సాగిన మారథాన్.. ఆకట్టుకున్న యోగా ప్రదర్శనలు



**నిర్మల్,మే:18(తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగా, వ్యాయామాలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" యువజన, క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన "ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ, మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా) నుంచి ప్రారంభమైన మారథాన్ ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, యోగా, శారీరక వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నిరంతర శారీరక శ్రమ వల్ల అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. యోగా, ఎక్సర్‌సైజ్‌ల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఈఓ భోజన్న, సిపిఓ జీవరత్నం, మునిసిపల్ కమిషనర్ రవి బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భౌతిక శాస్త్రంలో రవి వర్మకు పీహెచ్.డీ.

**పటాన్ చెరు, మే 18, (తెలంగాణ వాణి రిపోర్టర్):**



హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, భౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఐ.ఎస్. రవి వర్మ డాక్టరేట్ కు అర్హత సాధించారు. నానోకాంపోజిట్ పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్లలో సోడియం అయాన్ ప్రసరణ యంత్రాంగం అనే అంశం పై అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ భౌతిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రమేష్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రవి వర్మ పరిశోధన తదుపరి తరం శక్తి నిల్వ వినియోగం కోసం అధునాతన నానో కాంపోజిట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్ ఫిల్మ్ ల అభివృద్ధిపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనంలో ఛీఖూఖీ6 లవణం, ఇథలీన్ కార్బోనేట్ ప్లాస్టిసైజర్, ూశ్రీ2ూ3, నానోఫిల్లర్ ను చేర్చిన పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్ వ్యవస్థను సంశ్లేషణ చేయడం ద్వారా గది ఉష్ణోగ్రత వద్ద మెరుగైన అయానిక వాహకతను సాధించారన్నారు. ఈ పరిశోధనలో, ఖీ×=, ఖూజ, ూజువీ, శ=ఱ, ఎలక్ట్రోకెమికల్ ఇంపిడెన్స్ స్పెక్ట్రోస్కోపీ వంటి అధునాతన లక్షణీకరణ పద్ధతులను ఉపయోగించి, అభివృద్ధి చేసిన ఫిల్మ్ ల యొక్క నిర్మాణాత్మక, విద్యుత్, విద్యుద్వాహక, విద్యుత్ రసాయన ధర్మాలను అన్వేషించినట్టు తెలిపారు. సురక్షితమైన, అధిక పనితీరు గల సాలిడ్–స్టేట్ సోడియం–అయాన్ బ్యాటరీలు, పునరుత్పాదక శక్తి నిల్వ వ్యవస్థలు, సూపర్ కెపాసిటర్లు, ఫ్యూయల్ సెల్స్, ఎలక్ట్రోక్రోమిక్ పరికరాలు, ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ లో ఈ పదార్థాన్ని ఉపయోగిం చడానికి బలమైన సామర్థ్యం ఉందని ఈ పరిశోధన ఫలితాలు నిరూపిస్తున్నాయని వివరించారు. భవిష్యత్ శక్తి సాంకేతికతల కోసం సమర్థవంతమైన, సుస్థిరమైన సాలిడ్–స్టేట్ ఎలక్ట్రోకెమికల్ పరికరాల అభివృద్ధికి ఈ అధ్యయనం గణనీయంగా దోహదపడుతుందని భావిస్తున్నామన్నారు.

## విడిసి భవనానికి భూమి కేటాయించండి

**నిర్మాణ అనుమతులు కూడా జారీ చేయండి**

**బుగ్గారం సర్పంచ్, పాలక వర్గం, పంచాయతీ కార్యదర్శులకు విడిసి విజ్ఞప్తి**



**జగిత్యాల/ బుగ్గారం: 18 మే (తెలంగాణ వాణి విలేకరి )**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటి – బుగ్గారం కు పక్కా భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, నిర్మాణ అనుమతులు కూడా జారీ చేయాలని సోమవారం జరిగిన అత్యవసర పాలక వర్గం సమావేశంలో విడిసి విజ్ఞాపన పత్రాలు అందజేసింది. గ్రామ నడి బొడ్డున నిర్మాణ దశలో ఉన్న ఎంపిపి కార్యాలయం ప్రక్కన ప్రస్తుత పోలీస్ స్టేషన్ పార్కింగ్ స్థలంలో గ్రామ అభివృద్ధి కమిటి కి పక్కా భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని వారు కోరారు. విడిసి వ్యవస్థాపక అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, ఉపాధ్యక్షులు సుంకం ప్రశాంత్ లు గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ, పంచాయతీ కార్యదర్శి అక్బర్ లతో పాటు ఉప సర్పంచ్ జంగ లావణ్య, వార్డ్ సభ్యులకు వారు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఈ నాటి పాలక వర్గం సమావేశంలో తీర్మాణం చేసి, గ్రామ సభలో కూడా తీర్మాణం చేసి తీర్మానాల ప్రతులతో పాటు భవన నిర్మాణ అనుమతులు కూడా జారీ చేయాలని వారు కోరారు.

# పర్యాటక కేంద్రంగా ముత్తంగి ఎంక చెరువు

- ఏడు కోట్ల 60 లక్షల రూపాయలతో చెరువు సుందరీకరణ
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్
- అతి త్వరలో ప్రారంభోత్సవం

**పటాన్ చెరు, మే 18, (తెలంగాణ వాణి రిపోర్టర్)**
ముత్తంగి డివిజన్ పరిధిలోని ఎంక చెరువును 7 కోట్ల 60 లక్షల రూపాయలతో సుందరీకరణ చేస్తున్నామని.. అతి త్వరలో ప్రజలకు అందుబాటు లోకి తీసుకొని రానున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం హెచ్ఎండిఏ అధికారులు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. స్వయంగా చెరువు కట్టపై ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో గల ఎంక చెరువును పర్యటకంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంతో హెచ్ఎండిఎ ద్వారా 7 కోట్ల 60 లక్షల రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కట్ట అభివృద్ధితోపాటు బతుకమ్మ ఘాట్,





లైటింగ్, వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ లైటింగ్, గార్డెనింగ్, తదితర పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మరో రెండు నెలల్ల పనులు పూర్తిచేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని హామీ ఇచ్చారు. ఇస్నాపూర్ ప్రజలు సైతం చెరువు కట్ట పైకి సులభంగా చేరుకునేందుకు కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు తెలిపారు. ముత్తంగితోపాటు ఇస్నాపూర్, పాశమైలారం, చిట్కుల్, లకడారం గ్రామాల ప్రజలకు ఆహ్లాదకరమైన చెరువు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పటాన్ చెరు లోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, దోషం చెరువులను సైతం పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దు తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ డిఈ రామారావు, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కుమార్ గౌడ్, ప్రభాకర్, కిట్టు, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, అబేద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు

- రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.
- అసత్య ప్రచారాలు రైతులు నమ్మవద్దు...గతంలో కన్నా అత్యధిక ధాన్యం కొనుగోలు
- జగిత్యాల నియోజకవర్గం లో 1 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేశాం
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల:మే 18(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు ప్రక్రియ, కేంద్రంలో వసతి సదుపాయాలు పై రైతులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం లక్ష్మీ పూర్ మొక్కజొన్న కొనుగోలుపై



రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కోరిన వెంటనే కొనుగోలు కేంద్రం మంజూరు చేసి,రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైనపుడు గన్ని సంచులు మంజూరుకు కృషి చేస్తున్న సంజయ్ కుమార్ కు గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# పుష్కర పనులను పరిశీలించిన కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లిమే 18 (తెలంగాణ వాణి)**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద త్రివేణి సంఘము స్థానంలో మే 21 నుండి జూన్ 1 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన ఘాట్‌ను పరిశీలించిన కలెక్టర్ భక్తుల సౌకర్యార్థం గోదావరి నదిలో క్వయర్ మ్యాట్ ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. భక్తులు సమాచారం తెలుసుకునేలా తగిన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం హెలిప్యాడ్‌ను పరిశీలించి, హెలిప్యాడ్ చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, నీరు చల్లడం, ప్రధాన ఘాట్ నుండి సరస్వతి ఘాట్ వరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారిపై నిరంతరం నీటిని చల్లుతూ ఉండాలని ఆదేశించారు. అలాగే హెలిప్యాడ్ వద్ద పెయింటింగ్, రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తరువాత సరస్వతి ఘాట్‌ను పరిశీలించిన కలెక్టర్ భక్తులు బట్టలు మార్చుకునే గదులు, షవర్ ట్యాప్స్ వంటి సదుపాయాలను పరిశీలించారు. గోదావరి నదిలో నీటి మట్టాన్ని పరిశీలించి, భద్రతా చర్యలల్లో భక్తులు నదిలోకి వెళ్లకుండా ప్రతి 50 మీటర్లకు బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, గజ ఈతగాళ్లను నియమించాలని సూచించారు. ఘాట్ మెట్లపై వేసిన అచ్చుల డిజైన్లకు రంగులు వేయాలని, సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేస్తున్న సదుపాయాలను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే స్టాల్స్ ఏర్పాటు చేయుచున్న ప్రాంతాన్ని, టెంట్ సిటీ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. మ్యూజియాన్ని పరిశీలించిన కలెక్టర్ సమయం తక్కువగా ఉన్నందున ముఖ్యమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి విగ్రహం వద్ద పూర్తి సమాచారాన్ని ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ లు హరికృష్ణ, రవీందర్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్, విద్యుత్తు, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల సాధికారతకు సహాయ ఉపకరణాలు ఎంతో ఉపయోగం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి, మే 18 (తెలంగాణ వాణి)**
దివ్యాంగుల సాధికారతకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదమవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో అలింకో సంస్థ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖ కార్యాలయం సంయుక్తంగా నిర్వహించిన దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. దివ్యాంగులు విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావడానికి అవసరమైన సహకారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సహాయ ఉపకరణాలు వారి దైనందిన జీవితాన్ని సులభ తరం చేయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నా రు. ఈ క్యాంప్‌లో మొత్తం 75 మంది దివ్యాంగులకు 94 ఉపకరణాలు అందజేశారు. వాటిలో ట్రై సైకిళు



,, 6 సీపీ చెయిర్లు, 40 టీఎల్ఎం కిట్లు, 1 విజువల్లి ఇంపెయర్డ్ కిట్ (సుగమ్య కేన్), 18 వీల్ చెయిర్లు, 28 హియరింగ్ ఎయిడ్స్, 1 రోలేటర్ పంపిణీ చేశారు. దివ్యాంగులకు అవసరమైన సహాయక ఉపకరణాలు అందించడం ద్వారా వారి దైనందిన జీవితంలో మరింత స్వావలంబన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శారద, సీఎంఓ కవిత, కోఆర్డినేటర్ మల్లేష్ గౌడ్, హెచ్ఎం అరుణ , అన్ని మండలాల ఐఈఆర్పీలు పాల్గొన్నారు

## తాళి,తప్ప పేరుతో తూకం ఎక్కువ వేస్తున్నారని రోడ్డుపై బైఠాయించిన అన్నదాతలు

**మల్లాపూర్:మే18,(తెలంగాణ వాణి)**
మండలంలోని ముత్యంపేటలోని వరి ధాన్యము కొనుగోలు కేంద్రాలలో తాళి తప్ప పేరుతో తూకం ఎక్కువ వేస్తున్నారని మాజీ వైస్ ఎంపీపీ నాగేష్ ఆధ్వర్యంలో రైతులతో ధర్నా చేపట్టాడు. ఈసందర్భంగా నాగేష్ మాట్లాడుతూ ముత్యంపేట,రాఘవపేట రెండు గ్రామాలలో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలోని ధాన్యాన్ని కొనుగోలు చేయగా ముత్యంపేటలో మాత్రమే కిలో ధాన్యాన్ని తాళి తప్ప పేరుతో తూకం వేస్తున్నారని అన్నారు. ఖానాపూర్ మెట్పల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టగా విషయం తెలుసుకున్న మల్లాపూర్ ఎస్సై అనిల్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోకులు ధర్నా చేస్తున్న రైతుల వద్దకు వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.



ధర్నా చేస్తున్న రైతులకు మద్దతుగా మాజీ జెడ్పిటిసి సంధిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ముద్దం శరత్ గౌడ్,డబ్బా రమేష్ రెడ్డి,తెడ్డు రంజిత్, సుద్దాల చిన్న గంగారం,రైతులు ఏజిబి రాజారెడ్డి,మరిపెల్లి ప్రసాద్, మరిపెల్లి రవి, బీర్కులనందం,వాకిటి లక్ష్మారెడ్డి, నిమ్మల శేఖర్ రెడ్డి తో పాటు పలువురు రైతులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## రాంసాగర్ గ్రామంలోని హనుమాన్ ఆలయానికి స్టీల్ తలుపులు విరాళంగా అందజేత

**కొమురవెల్లి తెలంగాణ వాణి ప్రతినిధి మే.18**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని రాంసాగర్ గ్రామంలో గల శ్రీ హనుమాన్ ఆలయానికి గ్రామానికి చెందిన దాత అక్కేనపల్లి యాదవ రెడ్డి ం/శీ అక్కేనపల్లి రాఘవరెడ్డి సుమారు రూ.15 వేల విలువగల స్టీల్ తలుపులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయం అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.దాతృత్వ భావంతో ఆలయానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం ఎంతో అభినందనీయమని గ్రామ పెద్దలు కొనియాడారు. ఆలయ అభివృద్ధికి ఇలాంటి సహకారం మరింత అవసరమని, ఇతరులు కూడా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయికులు అక్కేనపల్లి ప్రవీణ్ రెడ్డి , అక్కేనపల్లి నర్సింహారెడ్డి, గుజ్జు రాజయ్య (బీరప్ప) పాకనాటి మల్లయ్య,అక్కేనపల్లి పండు తదితరులు, గ్రామ పెద్దలు పాల్గొని దాతను అభినందించారు.

## 5 కే రన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే




**జగిత్యాల:మే 18(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా స్పోర్ట్స్ ,యూత్ ఆద్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జగిత్యాల స్వామి వివేకానంద స్టేడియం నుండి 5 కే మారథాన్ ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## బొమ్మ శ్రీ రామ్ చక్రవర్తికి అభినందనలు తెలిపిన వొడితల ప్రణవ్

**డైరెక్టర్లలో హుజురాబాద్ కి అవకాశం ఇవ్వండి**

**మున్నూరు కాపుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**కరీంనగర్ ఆత్మీయ అభినందన సభలో హుజురాబాద్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్**



**హుజురాబాద్ మే 18 (తెలంగాణ వాణి)**
కష్టపడ్డ కార్యకర్తలకు పదవులు ఇస్తూ,రాష్ట్రంలో ఒకేసారి 11 కార్పొరేషన్ చైర్మెన్ లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడతల ప్రణవ్ అన్నారు. సోమవారం రోజున కరీంనగర్ పట్టణంలోని ఇందిరా (డీసీసీ) భవన్ లో ఇటీవల మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మెన్ గా ఎన్నికైన బొమ్మ శ్రీ రామ్ చక్రవర్తి అభినందన సభకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ రామ్ చక్రవర్తికి మా కుటుంబానికి చాలా దగ్గరి వ్యక్తి ఆయనకు ఈ పదవి రావడం సంతోషమని, మున్నూరు కాపుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, డైరెక్టర్ల జాబితాలో హుజూరాబాద్ ప్రాంతానికి కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సుడ చైర్మెన్ నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మల్లేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణ, ఆరేపల్లి మోహన్, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, కార్పొరేటర్లు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**





**జగిత్యాల, మే 18 (తెలంగాణ వాణి)**
ప్రజావాణి అర్జీలపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 81 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తెలంగాణ టూరిజం వారి టూరిస్ట్ గైడ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

**ములుగు,మే18(తెలంగాణ వాణి):**
ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీసమ్మక్క సారలమ్మ తల్లులను ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కు గిరిజన సంస్కృతి సంప్రదాయాల డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో పూజారులు,అధికారులు ఘన స్వాగతం పలికారు.అనంతరం జిల్లా కలెక్టర్ వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.



## గాంధీనగర్ గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణపై గ్రామ సభ






**ములుగు,మే18(తెలంగాణ వాణి):**
ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని గాంధీనగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో 350మంది గ్రామ ప్రజలతో ఆదర్శ గ్రామ నిర్మాణంపై అవగాహన కల్పిస్తూ గ్రామ సభను నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలవికాస ఆదర్శ గ్రామం పథకం సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్డు భవనాలు నిర్మించుకోవడం కాదు వినూత్న కార్యక్రమాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టు బాట్లు నియమాలు పద్ధతులు పెట్టుకుని వాటిని పాటిస్తూ ఊరంతా కలిసి ఒకే మాట ఒకే బాటలో ఐక్యముతో ఉంటే ఆదర్శ ఆదర్శ గ్రామం సాధించుకోవచ్చని అభివృద్ధి గ్రామానికి ఆదర్శ గ్రామానికి తేడా మనకు అర్థం కావాలని డబ్బులుంటే అభివృద్ధి చేసుకోవచ్చు కానీ ఆదర్శ గ్రామమంటే ప్రజలందరూ కలిసి ఒకరికొకరు ఆలోచనలు అభిప్రాయాలు పంచుకుంటూ ఐక్యమత్యంతో గ్రామంలో ఉన్న వనరులను గుర్తించి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవచ్చు ఈ సందర్భంగా ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న మాట్లాడుతూ మా గ్రామంలో పాల వికాసం సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామపంచాయతీ నుండి పూర్తి సహకారం అందిస్తాము బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకంలో మా గ్రామం ఎన్నుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు ఈరోజు మా గ్రామంలో ఒక పండగ వాతావరణం ఉందన్నారు గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకోవడానికి ముందుకొచ్చిన కమిటీ వాళ్లకు అభినందనలు తెలుపుతున్నాము అందరం కలిసి మన గ్రామాన్ని మార్చుకున్నామని గ్రామస్తులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్,పంచాయతీ కార్యదర్శి రఘు,వార్డు సభ్యులు,మాలోత్ శంకర్,కూరాకుల సురేష్,రామావత్ సంధ్య,తేజావత్ హుని,లిక్కి కుమారస్వామి,లాకావత్ ఈరయ,బాలవికాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజ్ కుమార్ డెవలప్మెంట్ ఏజెంట్లు కే వినయ్ కుమార్,శంకర్ గ్రామం పెద్దలు గ్రామ ప్రజలు యువకులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ముడుపుల దందా!

- ఈ దందాను ఆపే నాథుడే లేరా
- రు. 200లకు బదులుగా రు.5నుంచి రు.10వేలు ముడుపులా!
- డాక్యుమెంట్ రైటర్ల రూటే సపరేట్
- కార్యాలయంలో ప్రయివేట్ సిబ్బంది ద్వారా బేరసారాలు

**కొత్తగూడెం మే 18 (తెలంగాణ వాణి)**
జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని సభ్యులు రిజిస్టర్ కార్యాలయాన్ని అడ్డా చేసుకుని ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్లతో పాటు కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి ఒకరు ప్రైవేట్ వ్యక్తిని నియమించుకుని భారీ ఎత్తున ముడుపులు తీసుకుంటున్నట్టు ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. సబ్ రిజిస్టర్ కూర్చునే రూముకు పక్కనే ఉన్న స్టాంపు వెండర్ కార్యాలయాన్ని అడ్డా చేసుకుని చేస్తున్న ఈ అక్రమ దందాలు "మూడు పువ్వులు" "ఆరు కాయలు"గా తయారైందని ఆరోపణలు ఉన్నాయి. సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న అవినీతి అక్రమాలపై సర్వత్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ దీనిని పట్టించుకునే నాధుడే కరువయ్యారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. హిందూ వివాహ యాక్టు ప్రకారం వివాహ రిజిస్ట్రేషన్ కు రు. 200 మాత్రమే ఫీజు చెల్లించాల్సి ఉంది.




కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు సదరు యాక్ట్ ప్రకారం వివాహ రిజిస్ట్రేషన్ కొచ్చిన వారి నుండి వారి అవసరాన్ని బట్టి 3 వేలు,ర 5వేలు 10వేలు ముడుపులు దండుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో ఇలా బహిరంగంగానే ముడుపులు దండుకుంటున్నప్పటికీ ప్రశ్నించే నాధుడు కరువయ్యారని బాధితులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నెల 16వ తేదీన "తెలంగాణ వాణి" దినపత్రికలో డాక్యుమెంట్ రైటర్ల దోపిడీకి అడ్డే లేదా! అని కథను వెలువడిన విషయం పాఠకులకు విరుద్ధమే. అయినా సంబంధిత అధికారులు ఈ విషయంపై జోక్యం చేసుకోకపోవడం వల్లనే మరింత దోపిడీ వ్యవహారం పెరిగిపోతోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా దోపిడీకి పాల్పడుతున్న వారికి రాజకీయ అండదండలు ఏమైనా ఉన్నాయా? లేక అధికారులే స్వయంగా వత్తాసు పలుగుతున్నారా? అన్న అనుమానాలు బాధితుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే హిందూ యాక్ట్ ప్రకారం ఫీజు చెల్లించుకుని రిజిస్ట్రేషన్ కాగితాలు పొందాల్సిన బాధితులు పెద్ద ఎత్తున ముడుపులు చెల్లించాల్సి వస్తుండటంతో నూతనంగా పెళ్లిళ్లు చేసుకుని రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లాలంటేనే భయంతో వణికి పోతున్నారు. ఈ చిన్న వ్యవహారం లోనే ఇంత జరుగుతుంటే గిరిజన చట్టాలు అమలు అవుతున్న కొత్తగూడెం జిల్లాలో భూములు, ఇళ్ల స్థలాలు, కట్టుకున్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ కోసం వెళ్లే వారి నుంచి ఇంకా పెద్ద ఎత్తున ముడుపులు దండుకుంటారన్న పలువురు గుసగుసలాడు కుంటున్నారు. అసలే అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంతో ఇంధను వనరులు అందుబాటులో లేక ఒకపక్క ప్రజలు ఇబ్బందులు గురవుతూ మరోపక్క ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈ దోపిడీ వ్యవహారం ఏమిటని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- బూర్గంపాడులో వివిధ శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహణ

**భద్రాద్రి బ్యూరో మే 18 (తెలంగాణ వాణి)**
తెలంగాణ రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ, వరదలు, అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, సహాయక చర్యలపై సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి హరిచందన, రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎన్డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాణనష్టాన్ని నివారించడమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తో కలసి పాల్గొని, బూర్గంపాడులో నిర్వహిస్తున్న మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ వివిధ శాఖల అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని అంబేద్కర్ నగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రెస్క్యూ, పునరావాస చర్యలను పరిశీలించారు. ఫైర్ శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్కు ఆరవ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన కే. శంకర్, సీఆర్పీఎఫ్ కమాండర్ రాజేష్ దోగ్రా అబ్జర్వర్లుగా వ్యవహరించారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను లైఫ్ జాకెట్లు, బోట్లు సహాయంతో




సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అంబులెన్స్‌ల ద్వారా పునరావాస కేంద్రాలకు చేర్చడం, బాధితులకు త్రాగునీరు, భోజనం, వైద్య సేవలు, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించడం వంటి చర్యలను డెమో రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు ఎస్సీ కాలనీ నుంచి 10 మంది గర్భిణీలు, 45 మంది చిన్నారులు సహా మొత్తం 200 మందిని, 26 పశువులను సురక్షితంగా బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ బాధితులకు తక్షణ వైద్య సేవలు, ఆశ్రయం, త్రాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించారు. వివిధ శాఖల అధికారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పశుసంవర్ధక శాఖల సిబ్బంది సమన్వయంతో సేవలు అందించారు. గజ ఈతగాళ్ల సహాయంతో చేపట్టే రెస్క్యూ విధానాలను కూడా ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, ఆపరేషన్ సెంటర్లు, వైద్య శిబిరాలను జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. బాధితులకు అందిస్తున్న త్రాగునీరు, భోజనం, తాత్కాలిక నివాస సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాల ద్వారా అందిస్తున్న సేవలు, మందుల పంపిణీ, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన పశువైద్య



శిబిరాన్ని కూడా పరిశీలించి, పశువులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది బాధితులకు సమన్వయంతో సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు అప్రమత్తత, శాఖల మధ్య సమన్వయం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చున్నారు. ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడి అత్యవసర పరిస్థితుల్లో వారు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో "గోల్డెన్ అవర్"లో తీసుకునే చర్యలు ప్రాణ రక్షణకు కీలకమని, శాఖల మధ్య సమన్వయం ద్వారా తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్తులో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇలాంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, బూర్గం పహాడ్ తాసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు,ఎన్ డి ఆర్ ఎఫ్,ఎస్ డి ఆర్ ఎఫ్,ఎన్ ఎన్ సి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో రెడ్‌క్రాస్ ప్రత్యేక మెంబర్‌షిప్ డ్రైవ్ ప్రారంభం

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**ములుగు,మే18(తెలంగాణ వాణి):**
తెలంగాణ రాష్ట్ర గవర్నర్,ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ చైర్మన్ శివ్ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో ప్రత్యేక మెంబర్‌షిప్ డ్రైవ్‌ను శనివారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే1వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు,సేవా గుణం కలిగిన ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ స్పెషల్ మెంబర్షిప్ డ్రైవ్ కొరకు డేటా కేంద్రాన్ని జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనములో ఏర్పాటు చేయడం జరిగిందని, సభ్యత్వ వివరాల కొరకు కోశాధికారి,స్పెషల్ డ్రైవ్ ఇన్చార్జి శిరుప సతీష్ కుమార్‌ను 9948427050 నెంబర్ లో లేదా ప్రధాన కార్యదర్శి చుంచు రమేష్ ను 9394774644లో సంప్రదించగలరు.



# బక్రీద్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

- విద్యుత్, తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి
- సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల

**నిర్మల్, మే:18(తెలంగాణ వాణి ప్రతినిధి)**
బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రార్థనా స్థలాల్లో తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా



అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పండుగ నేపథ్యంలో పురపాలక, గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈద్గాల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. అలాగే ప్రార్థనల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.జిల్లా ప్రజలు అన్ని పండుగలను పరస్పర సహకారం, సామరస్యంతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున తగిన బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ ఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్లు అప్పాల గణేష్ చక్రవర్తి, బిబి కుతిజ సిద్ధికి, వివిధ శాఖల అధికారులు, హిందు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## 23 వరకు పర్యాటక వారోత్సవాలు

**పర్యాటక వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ఖమ్మం, మే 18 (తెలంగాణ వాణి)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి మే 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాలను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ, మే 20న ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు, మే 21న జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై యూట్యూబ్ వీడియో ప్రెజెంటేషన్ చేసిన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా టూరిజం సర్టిఫికెట్ ప్రధానం చేయబడుతుందని, మే 22న నేలకొండపల్లి బుద్ధ స్థూపం వద్ద స్వచ్ఛత/పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి సునీల్ రెడ్డి, తెలంగాణ టూరిజం అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, టూరిజం ఉద్యోగి చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.



## శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

**మత పెద్దలతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ మీటింగ్లో కొత్తగూడెం డిఎస్పీ**






**కొత్తగూడెం మే 18 (తెలంగాణ వాణి)**

శాంతియుత వాతావరణంలో పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ అన్నారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం కొత్తగూడెం 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ అండ్ ఎం ఫంక్షన్ హాలు నందు పట్టణంలోని మత పెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మత సామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు. పండుగ ఏ మతానిది అయిన సామరస్యత చాలా మంచి సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం పట్టణంలోని అన్ని మతాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పీస్ కమిటీ సమావేశంలో కొత్తగూడెం 2టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, 1టౌన్ సీఐ కరుణాకర్, 3టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూముల పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి

**సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప డిమాండ్.**



**కొత్తగూడెం మే 18 (తెలంగాణ వాణి)**

లపాత కొత్తగూడెంలో గత ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబల్ బెడ్ రూమ్ ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించి నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని మాజీ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం డివిజన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్రూంల నిర్మాణాన్ని చేపట్టి నిర్మాణాలు పూర్తి కాకుండానే లబ్ధిదారులను నిర్ణయించడం జరిగిందని ఉన్నారు. ఇది ఆనాడు ఓట్ల కోసం ప్రభుత్వం చేసిన మోసంగా పరిగణించక తప్పదని ఆయన విమర్శించారు. 2016లో పాత కొత్తగూడెంలో ఎనిమిది వందల 26 డబుల్ బెడ్ రూమ్ లను నిర్మాణాన్ని ప్రారంభించారని, అందులో కనీసం 200 గృహాలు కూడా పూర్తి కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోసం ఆరోజు హడావుడిగా నిర్మాణాలు పూర్తి కాకుండానే డ్రా తీయడం జరిగిందని అన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి మంజూరు పత్రాలు ఇవ్వకుండానే మోసం చేశారని ఆయన విమర్శించారు. అప్పటి నుండి ఇప్పటికి నిర్మాణాలు పూర్తికాక ఇటు 75 గజాల స్థలంకు, ఇందిరమ్మ గృహాలకు లబ్ధిదారులను అనర్హులుగా తేల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ల నిర్మాణం పూర్తికాక, ఇటు ఇందిరమ్మ గృహాలు మంజూరు కాక, సంకట స్థితిలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వీటికి నిధులను కేటాయించాలని, అప్పుడు డ్రాలో అర్హులైన లబ్ధిదారులకు డబల్ బెడ్రూంలు కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అందులో అనర్హులు ఉంటే వాటి వరకే ఆ జాబితా నుండి తొలగించాలే తప్ప మొత్తానికి మల్ల డ్రా తీస్తామంటే అనేకమంది పేదవారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉందని తక్షణమే వాటికి నిధులు కేటాయించి, అప్పుడు డ్రా తీసిన అర్హులైన వారికే డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఓం నారాయణ, గడిదాసు కుమార్, బత్తుల పద్మ, గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## జెండా ఊపి మారథాన్ను ప్రారంభించినా ఎంపీడీవో తాళ్లూరి రవి

**జూలూరుపాడు: మే 18 ( తెలంగాణ వాణి ప్రతినిధి):**



మండల కేంద్రంలో ఈరోజు ఉదయం 7 గంటలకు మండల అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి జెండా ఊపి మారథాన్ ప్రారంబించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా , ప్రధాన రహదారి మండల కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు 2కె రన్ ను నిర్వహించారు. యువజన, క్రీడాల శాఖ ఆధ్వర్యంలో ఫిట్,ఆక్టివ్ తెలంగాణ,మారథాన్, ఫిజికల్ లిటరసీపై 2కె రన్ కార్యక్రమం చేపట్టినట్లు తాళ్లూరి రవి వెల్లడించారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభించిన మారథాన్ సాయిబాబా టెంపుల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు సాగిందన్నారు. 2కె రన్ లో మార్నింగ్ వాకర్స్,క్రీడా కారులు, యువకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఉల్లాసంగా,ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ బాదావత్ రవి, ఎంపీవో తులసిరామ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, సర్పంచులు, పలువురు రాజకీయ ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చురుకుగా, ఆరోగ్యకరంగా ఉండాలంటే రోజువారి పనులలో భాగంగా వ్యాయామం తప్పనిసరి అని అన్నారు.ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పథకాల పనితీరు ఆదర్శనీయమని ప్రభుత్వ పథకాలు విజయవంతం కావడానికి ప్రజల ఆదరణే కారణమన్నారు.కాబట్టి మండల ప్రజలు ప్రభుత్వ పథకాలు ప్రజలలో వెళ్తూ,ప్రజలు కూడా సానుకూలంగా స్పందిస్తూ అలాగే అనునిత్యం ప్రజలలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ప్రతి ఒక్క పథకం దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని అధికారులు తెలిపారు.

# వరద ముంపు మాక్ డ్రిల్ సక్సెస్

- పజల రక్షణే మా లక్ష్యం .
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి.

**హనుమకొండ, మే 18 (తెలంగాణ వాణి టౌన్ )**



నగరంలోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన మాక్ ఎక్సర్సైజ్ (డ్రిల్) వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతమైంది. ప్రకృతి విపత్తులు, అర్బన్ ఫ్లడింగ్ సమయంలో యంత్రాంగం స్పందించే తీరు, ప్రజల తరలింపు, సహాయక చర్యలపై అవగాహన కల్పించేందుకు ఈ డ్రిల్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి, డీసీపీ కవిత, అదనపు కలెక్టర్ రవి, ఇతర ఉన్నతాధికారులు సమ్మయ్య నగర్, వివేకనగర్, లష్కర్సింగారం యూపీహెచ్సీ ప్రాంతాల్లో సహాయక చర్యలను స్వయంగా పరిశీలించారు.ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో రెస్క్యూ ఆపరేషన్స్ ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్డీఆర్ఎఫ్ , అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, వైద్య శాఖల సమన్వయంతో ఈ మాక్ డ్రిల్ సాగింది. ఎన్డీఎంఏ మార్గదర్శకాల ప్రకారం.. టీఎన్జీవోస్ కాలనీ, వివేకనగర్, సమ్మయ్య నగర్, ప్రగతి నగర్, గోపాలపూర్ జవహర్ కాలనీ, టీవీ టవర్ కాలనీల్లో అత్యవసర సైరన్లు మోగించి ప్రజలను అప్రమత్తం చేశారు. డ్రోన్ల ద్వారా ఆహారం వివేకనగర్లో వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల ద్వారా ఆహారం అందించి, భవనాల పైనుంచి రెస్క్యూ బృందాలు సురక్షితంగా కిందికి దించాయి.లైఫ్ బోట్ల సహాయంతో ముంపునకు గురైన సమ్మయ్య నగర్ వాసులను లైఫ్ బోట్లు, ప్రత్యేక వాహనాల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించారు.వైద్య సేవలు లష్కర్సింగారం యూపీహెచ్సీలో బాధితులకు 108 అంబులెన్సుల ద్వారా తక్షణ వైద్య సేవలు అందించారు. పునరావాస కేంద్రం స్నేహనగర్లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో బాధితులకు బెడ్లు, తాగునీరు, భోజన వసతితో పాటు డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ముందస్తు ప్రణాళికతోనే ప్రాణనష్టం నివారణ: కలెక్టర్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి మాట్లాడుతూ.. నగరం అర్బన్ ఫ్లడింగ్, ఫ్లాష్ ఫ్లడ్స్కు గురయ్యే అవకాశం ఉన్నందున పాత "ఫైర్ ఫైటింగ్ అప్రోచ్" కాకుండా, ముందస్తు ప్రణాళికతో కూడిన వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా "ఇన్సిడెంట్ కమాండ్ పోస్ట్" ఏర్పాటు చేసి, ఒక కమాండర్ పరిధిలో 12 విభాగాలను సమన్వయం చేస్తున్నట్లు వివరించారు. కమాండెంట్ ఎన్. రవి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**వినతులు స్వీకరించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**

**జగిత్యాల:మే 18(తెలంగాణ వాణి ప్రతినిధి)**




ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 81ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తెలంగాణ టూరిజం వారి టూరిస్ట్ గైడ్ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## టి.వై.జె.ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎన్నికైన షేక్ మహబూబ్కు ఘన సన్మానం

**నారాయణఖేడ్, మే 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ.వై.జె.ఎఫ్) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎన్నికైన షేక్ మహబూబ్కు నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన టీ.వై.జె.ఎఫ్ సభ్యులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ మహబూబ్కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల నారాయణఖేడ్ ప్రాంత జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. షేక్ మహబూబ్ నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, అక్రిడిటేషన్, సంక్షేమ పథకాల అమలుకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీ.వై.జె.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్, తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఇబ్రాహీం, తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు అబ్దుల్ జబ్బార్, మండల అధ్యక్షుడు అంజనేయులు, యూనియన్ సభ్యుడు ఆనంద్ తదితరులు పాల్గొని షేక్ మహబూబ్కు శుభాకాంక్షలు తెలిపారు.



## 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక': టూరిజం కోర్సుల పోస్టర్లు ఆవిష్కరణ

**ఆదిలాబాద్, మే : 18 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**



జిల్లాలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్లోని విసి హాల్ లో యువ టూరిజం క్లబ్స్, హెరిటేజ్ డిపార్ట్మెంట్కు సంబంధించిన ఆన్లైన్ సర్టిఫికేట్ కోర్సుల పోస్టర్లను అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో మైనారిటీ సంక్షేమ అధికారి కలీం, జిల్లా పర్యాటక శాఖ అధికారి రవి కుమార్, భూభారతి కోఆర్డినేటర్ స్వాగత్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బిసి స్టడీ సర్కిల్ లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ పాల్గొని మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లా పర్యాటక రంగానికి ఎంతో అనువైన ప్రాంతమని, స్థానిక పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను విద్యార్థులందరూ తప్పక తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన జలపాతాలు, ప్రాచీన దేవాలయాలు ఉన్నాయని కొనియాడారు. ఈ రోజు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ లైబ్రరీ, స్టడీ హాల్ విద్యార్థులకు 'జిల్లా టూరిజం' అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించడం జరిగిందని, దాదాపు 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నరని తెలిపారు.
అనంతరం వ్యాసరచన పోటీ విభాగంలో పోశెట్టి ప్రథమ, హీరామణి ద్వితీయ, వరుణ్ తృతీయ బహుమతులు, అలాగే ఉపన్యాస పోటీలలో హీరామణి ప్రథమ, ప్రియాంక ద్వితీయ, ప్రనూష తృతీయ బహుమతులుగా భారత రాజ్యాంగం, జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీఎస్సీ కి సంబంధించిన విలువైన పుస్తకాలను అదనపు కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సోనియా, జిల్లా టూరిజం శాఖ అధికారి రవికుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్, విద్యార్థులు, పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎంపీ అరవింద్ కు వినతిపత్రం

**మల్లాపూర్:మే18,**

జగిత్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ ను సోమవారం రేగుంట గ్రామ సర్పంచ్ తిట్ల లహరి రాజేష్ కలిశారు.ఈసందర్భంగా రేగుంటలో పల్లె దవాఖాన శిథిలావస్థలో ఉన్నందున పున నిర్మాణానికి నిధులు కేటాయించాలని అలాగే అంగన్వాడీ భవనాలకు నిధులు మంజూరు చేయించాలని రాతపూర్వక వినతి పత్రాన్ని అందజేసారు.ఈకార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, మల్లాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు లవంగ శివ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మీతో పాటు పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 5కే మారథాన్ రన్

**ఆదిలాబాద్, మే : 18 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**



యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన 5కే మారథాన్ రన్ లో వారు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు సాగింది. ఈ రన్ లో ఉద్యోగులు, యువత, వివిధ వర్గాల వారు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, ఉత్సాహంగా పాల్గొన్నారు. 5ఖ రన్ లో గెలిచినా విజేతలకు ఈ సందర్భంగా మెడల్స్, ప్రశంస పత్రాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నిత్యజీవితంలో యోగాన్ని భాగస్వామ్యం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నిత్యం ధ్యానం యోగ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డివైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, డిఆర్డిఓ రాథోడ్ రవీందర్, డిపిఓ రమేష్, సంక్షేమ అధికారి మిల్కా, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, క్రీడ కోచ్లు, అధికారులు, యువత, ఉద్యోగులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి'కి 269 దరఖాస్తులు అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**కరీంనగర్: మే 18 (తెలంగాణ వాణి)**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థా యిలో పరిశీలించి పరిష్క రించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరిం చారు.మొత్తం 187 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడిక క్కడే పరిష్కరించగా మరికొ న్నింటిని అధికారులకు బదిలీ చేశారు.త్వరితగతిన దరఖా స్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించా రు.కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్వహిం చిన ప్రజావాణిలో 56 దరఖాస్తులు,హుజురాబాద్ రెవిన్యూ డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో 26 దరఖాస్తులు వచ్చా యి. మొత్తంగా జిల్లాలో 269 దరఖాస్తులు సమర్పించారు.

## " పీఎం రాహత్ " పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..**

**నిజామాబాద్ మే 18: (తెలంగాణ వాణి ప్రతినిధి)**



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన " పీఎం రాహత్ " పథకాన్ని ఇందూరు వాసులు సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఒక ప్రకటన లో తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందించడమే పథకం ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చేరిన వారికి ఏడు రోజుల పాటు వర్తిస్తుందన్నారు. నిర్నిత రోజుల్లో రూ. 1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్సను అందజేస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ అమల వుతున్న ఆసుపత్రుల్లో త్వరలోనే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కావున జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## భారత రెడ్ క్రాస్ సొసైటీ

### కరీంనగర్ జిల్లా సభ్యత్వ నమోదు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం



**కరీంనగర్:మే 18 (తెలంగాణ వాణి)**
భారత రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వ ర్యంలో సభ్యత్వ నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా కలెక్టర్ / రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చిత్రా మిశ్రా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ,18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ (క్రిమిన ల్ కేసులు లేనివారు) రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని పొందవచ్చని తెలిపారు. సభ్యత్వం పొందదలచిన వారు సభ్యత్వ దరఖాస్తు ఫారమ్‌ను పూర్తి చేసి,రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు ప్రతితో పాటు శాశ్వత సభ్యత్వ ఫీజు రూ. 1,100/- చెల్లించాలని సూచించారు.సభ్యత్వం పొందిన వారికి శాశ్వత సభ్యత్వ కార్డు అందజేయ బడుతుందని తెలిపారు. ఇప్పటికే సభ్యత్వం పొందిన సభ్యులు తమ వ్యక్తిగత వివరాలలో మార్పులు ఉన్నట్లయితే వెంటనే సరిచేసుకోవాలని సూచించా రు.ముఖ్యంగా మొబైల్ నంబర్,చిరునామా మార్పు లు,ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు మారదలచిన సభ్యుల ట్రాన్స్‌ఫర్ వివరాల ను నవీకరించుకోవాలని తెలిపారు.సభ్యుల వివరాల ను సకాలంలో నవీకరించుకో వడం ద్వారా భవిష్యత్తులో నిర్వహించే సభ్యత్వ కార్యక్ర మాలలో సమర్థవంతంగా భాగస్వామ్యం కావచ్చని, అత్యవసర పరిస్థితుల్లో అర్హతగల సేవలు అందించేం దుకు ఇది ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. మే 15, నుండి జూన్ 15, 2026 వరకు ప్రతి రోజు ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు (ఆదివారం సెలవు) రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో సభ్యత్వ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ స్వయంగా రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని స్వీకరించి, రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,ఆర్డీఓ కె. మహేశ్వర్,రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి.కేశవరెడ్డి,రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి.శ్రీనివాస్ రావు,రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**మహాదేవపూర్ మే 18 తెలంగాణ వాణి**
మే 21 నుండి జూన్ 01 వరకు కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చేపడుతున్న భద్రతా, బందోబస్తు మరియు ట్రాఫిక్ ఏర్పాట్లను భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పుష్కర ఘాట్లు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, కంట్రోల్ రూమ్, సీసీ కెమెరా పర్యవేక్షణ, భక్తుల రాకపోకలకు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లను అధికారులతో కలిసి సమీక్షించారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భద్రత పరంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ 24 గంటలు అప్రమత్తంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. అలాగే విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి భక్తులకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు.

## నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**



**నిజామాబాద్, మే 18 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే జిల్లాలో ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేయడం జరుగుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల అతిక్రమణను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖల ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. పర్యావరణ అనుమతులు లభించిన తరువాతే పోతంగల్ మండలం హంగర్గా గ్రామ శివారులోని మంజీరా నది నుండి ఇసుక రవాణాకు అనుమతించడం జరిగిందని తెలిపారు. టీజీఎండీసీ ద్వారా నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఇసుక రవాణా కొనసాగుతోందని, తన ఆదేశాల మేరకు బోధన్ ఆర్.డీ.ఓ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి ఈ మేరకు నివేదిక అందించారని అన్నారు. వే బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతోందని, ఉదయం 6.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకే ఇసుక వాహనాలకు అనుమతిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. టీజీఎండీసీ ద్వారా కొనసాగుతున్న కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతోందని, తూకంలో తేడా లేకుండా, ఓవర్ లోడ్ కు ఆస్కారం లేకుండా సీసీ కెమెరా ద్వారా నిఘా ఏర్పాటు చేశామని, జీ.పీ.ఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ఇసుక లోడ్ తో కూడిన వాహనం ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్తోంది అన్నది ఆన్లైన్ లో టీజీఎండీసీ ప్రధాన కార్యాలయంలో గమనించడం జరుగుతోందని అన్నారు. జిల్లాలోని మిగతా ఇసుక రీచ్ ల నుండి మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారా ట్రాక్టర్లలో ఇసుక రవాణాకు అనుమతించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులను సమన్వయము చేసి విస్తృత తనిఖీలు జరిపిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణా పారదర్శకంగా జరుగుతోందని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మారథాన్ ర్యాలీలో ప్రభుత్వ విప్

**నకిరేకల్ : మే 18 (తెలంగాణ వాణి)**



నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన మారథాన్ ర్యాలీలో నకిరేకల్ ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ శ్రీ వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయడం జరుగుతుందన్నారు. యువత ఆరోగ్యం గా ఉండేందుకు క్రీడ, వ్యాయామం, మారథాన్ లాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తుచేసే ఉద్దేశంతో ఈ మారథాన్ ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో మారథాన్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు .

# కరీంనగర్ జిల్లాలో 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- రూ.237 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- రికార్డు స్థాయిలో వారంలో 80 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- రైతులకు ఇబ్బందులు రానివ్వం
- రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్







**కరీంనగర్:మే 18 (తెలంగాణ వాణి ప్రతినిది)**
కరీంనగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, వచ్చేవారం లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా నిర్దేశించామని,ఇప్పటి వరకు రైతులకు 237 కోట్ల రూపాయ ల చెల్లింపులు జరిగాయని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,కవ్వంపల్లి సత్యనారాయణ,జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్ తో కలిసి అధికారులు,రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్ అసోసి యేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంన గర్ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఈ సీజన్లో 3.61 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటికీ 3 లక్షల ఒక వెయ్యి మెట్రిక్ టన్నులు కొనుగోళ్ల కోసం వచ్చిందని తెలిపారు. వచ్చిన ధాన్యం నుండి ఒక లక్ష 58 వేల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేశామని,రైతులకు ఇందుకు సంబంధించి 237 కోట్ల రూపా యల చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వారం రోజు ల్లోనే రికార్డు స్థాయిలో 80,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. రానున్న వారంలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళి కతో ఉన్నామని అన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉంటూ సజావుగా సాగేలా చూడాలని తెలిపారు. రానున్న రెండు వారాలు మరింత కీలకంగా వ్యవహరిం చాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీల సమస్య ప్రధానం గా కనిపిస్తోందని,లోకల్ హమాలీలను ప్రోత్సహిస్తూ ఈ సమస్యను అధిగమించా లని మంత్రి సూచించారు. ధాన్యం రవాణాకు సంబంధిం చి పూర్తిస్థాయిలో అధికారా లు ఇచ్చామని,లారీ అసో సియేషన్ ప్రతినిధులు సహక రించి కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని పేర్కొన్నా రు. పోలీస్ కమిషనర్ ఆధ్వ ర్యంలో ట్రాన్స్పోర్ట్ కు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూసుకోవాలని,జిల్లా పంచా యతీ అధికారి హమాలీల సమస్య పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం లోడు పూర్తయిన ప్రతి వాహనం 24 గంటల్లోగా మిల్లులో అన్లోడ్ అయ్యేలా పక్కా ప్రణాళిక రూపొందించాలని ఆదేశిం చారు. ఎక్కువ పరిమాణంలో ధాన్యం కొనుగోలు చేస్తూ ఇంటర్మీడియట్ గోదాములను స్టోరేజీ కోసం వినియోగిం చాలని సూచించారు. మిల్లర్లకు అన్ని విధాలా ప్రభుత్వం సహకరిస్తుందని, అదే రీతిలో రబీ ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లు అధికారులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిం చాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తనీయ వద్దని అన్నారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50% కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో ముందున్నా మని తెలిపారు. వారం రోజుల్లోనే 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మరో వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపుల విష యంలోనూ జిల్లా ముందు వరుసలో ఉందని తెలిపారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల కు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వచ్చింద ని కలెక్టర్ తెలిపారు. ఒక లక్ష 58 వేల 382 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు 78% ఆన్లైన్లో నమోదు పూర్తయింద ని తెలిపారు. 88% ధాన్యం మిల్లర్లు స్వీకరించారని అన్నారు. ఈ సమావేశంలో గ్రంథాల య చైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,ఆర్డీవోలు కె.మహేశ్వర్, ఎస్.రమేష్ బాబు,పౌరసర ఫరాల సంస్థ డిఎం రజనీ కాంత్,రైస్ మిల్లులు, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# లక్ష్యాలను రక్షణతో సాధించాలి

- పీవీకే 5 ఇంక్లైన్‌లో మల్టీ డిపార్ట్‌మెంట్ టీం సమావేశం
- గైర్హాజరు తగ్గించి ఉత్పత్తి పెంచాలి




**కొత్తగూడెం మే 18 (తెలంగాణ వాణి)**
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 ఇంక్లైన్‌లో సోమవారం మల్టీ డిపార్ట్‌మెంట్ టీం సమావేశం జరిగింది. ఉదయం మొదటి షిఫ్ట్‌లో, మధ్యాహ్నం రెండో షిఫ్ట్‌లో ఈ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీటీ సభ్యులు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులందరూ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తూ వినియోగదారులకు అందించాలని, నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో, సమైక్యంగా, సమర్థవంతంగా, నిజాయితీతో నిర్వహించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సింగరేణి 11 ఏరియాల్లో ఎండీటీ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా పీవీకే 5 ఇంక్లైన్‌లో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పీవీకే 5 ఇంక్లైన్‌లో అత్యధిక గైర్హాజరు ఉండటం వల్ల ఉత్పత్తి లక్ష్యం వెనుకంజలో ఉందని, గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తిని పెంచాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గనిలో ఎటువంటి సీరియస్ యాక్సిడెంట్ లేకుండా ఉత్పత్తి సాధించినందుకు గని ఉద్యోగులందరికీ ఎండీటీ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పీవీకే 5 ఇంక్లైన్ ఏజెంట్ రామ్ భరోస్ మహాతో మాట్లాడుతూ, ఇటువంటి సమావేశాల ద్వారా సంస్థ స్థితిగతులను తెలుసుకొని వ్యయం తగ్గించి ఉత్పత్తిని పెంచవచ్చని, ప్రతి ఒక్కరూ అంకితభావంతో సమిష్టిగా కృషి చేసి నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచాలని కోరారు. డిజిఎం(ఐఈడి) ఎన్.యోహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకత, మిషనరీ పనితనం, ఉత్పత్తి వ్యయం, ఉద్యోగుల సంక్షేమం కోసం సంస్థ తీసుకుంటున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం(ఐఈడి) ఎన్. యోహాన్, ఏజెంట్ రామ్ భరోస్ మహాతో, డిజిఎం(ఈడఎం) ఐ.వి.ఎస్.బి లక్ష్మణమూర్తి, అడిషనల్ మేనేజర్ (క్వాలిటీ) కే.సత్యనారాయణ రాజు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, పద్మావతి గని మేనేజర్ ఎం.వి.ఎన్. శ్యాం ప్రసాద్, ఎస్.ఈ(ఐఈడి) కే.ఆర్. నాగభూషణం, గని రక్షణ అధికారి వై.వి.ఎస్.కే కిషోర్ బాబు, సంక్షేమ అధికారి షేక్ షకీల్, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ చిలక రాజయ్య, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ భుక్యా రమేష్, ఇతర ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## డిసిసి కార్యాలయంలో జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ అత్యవసర సమావేశం

**మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరు**



**కరీంనగర్:మే 18 (తెలంగాణ వాణి ప్రతినిది)**
వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎస్.ఐ. ఆర్, బి.ఎల్.ఎ ల నియా మకం,తాగునీటి సమస్య, పార్టీ నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు అవకాశం కల్పించాలి అనే ప్రధాన అంశాలపై పి.ఎ.సి సమావే శంలో చర్చించడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన సోమవారం డిసిసి కార్యాల యంలో జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే,ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్,డిసిసి అధ్యక్షు లు,చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారా యణ,కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్న కుమార్,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో సహా జిల్లాకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు.
సమావేశంలో భాగంగా ప్రధానంగా వరి ధాన్యం కొనుగోలు,కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సర్, మంచినీటి సమస్య తదితర అంశాలపై చర్చించడం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా పార్టీ నేతలు క్రియాశీలకంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని,ఐకెపి సెంటర్ల వద్ద తాలు,తప్పా పేరుతో తరుగు లేకుండా కొనుగోలు జరిగేలా కాంగ్రెస్ శ్రేణులు పర్యవేక్షించాలని,రైస్ మిల్లర్లు, దళారుల మోసాలను అరికట్టడంలో చొరవ చూపడంతో పాటు జిపిఎస్ విధానం వల్ల లారీల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను స్థానిక శాసనసభ్యులు,అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎస్ఐఆర్ - ఓటరు జాబితా సవరణ: కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై నియోజకవర్గ ఇంచార్జ్‌లు,కో-ఆర్డినేటర్లు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,కరీంనగర్ జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపినారు,ఎస్ఐఆర్ పేరుతో సెక్యులర్ ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని,ప్రజలు తమ ఓటు విషయంలో జాగ్రత్తగా ఉండాలి పేర్కొన్నారు. బీఎల్ఏ-2 నియామకం: పీసీసీ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బిఎల్ఏ-2 (బూత్ లెవెల్ ఏజెంట్)ల నియామకం వెంటనే పూర్తి చేసి, నియమించిన బీఎల్ఏల పేర్లను ప్రతి నియోజకవర్గం నుండి డిసిసి ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని, బీఎల్ఏల ద్వారా స్థానికంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సహాయం చేయాలని ఆదేశించారు.

**వేసవిలో తాగునీటి సమస్యపై సమీక్ష:**
ఈ వేసవి కాలంలో అధిక ఎండల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం,పార్టీ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది,గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించడం జరిగిందని, నియోజకవర్గాల వారీగా తాగునీటి సమస్యపై కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్పొరేటర్లు,సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరినారు,ప్రజలు, మూగజీవుల కోసం ముఖ్య కూడళ్లు,బస్టాండ్లు, ఆసుపత్రుల వద్ద చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించడం జరిగింది.

కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యులు అంజన కుమార్ మాట్లాడుతూ పార్టీ మరియు నామినేటెడ్ పదవుల నియామకంలో పార్టీలో మొదటి నుండి క్రియాశీలంగా పని చేస్తున్న వారికి గుర్తింపు ఇవ్వాలని, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల నియామకంలో పార్టీ నిర్ణయించిన విధంగా కనీసం మూడు సంవత్సరాలుగా పార్టీలో కొనసాగుతున్న వారికి అవకాశం కల్పించాలనే అంశాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని, కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్న కార్యకర్తలకు న్యాయం జరిగేలా అధిష్ఠానం ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమావేశం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణ గౌడ్, హుజురాబాద్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు,పీసీసీ ప్రధాన కార్యదర్శి రెహమత్ హుస్సేన్ ,అనుబంధ సంఘాల అధ్యక్షులు కర్ర సత్య ప్రసన్నారెడ్డి,ఎండి తాజుద్దీన్,పులి ఆంజనేయులు గౌడ్,బోనాల శ్రీనివాస్,మడుపు మోహన్, మాజీ డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,కాంగ్రెస్ కార్పొరేటర్లు వరాల నరసింగం,ఆకుల నందిని ఉదయ్,టేల భూమయ్య, నాయకులు కంకణాల అనిల్ కుమార్,ఎస్.ఎ మోసీన్, అహ్మద్ అలీ, అబ్దుల్ రెహమాన్, వీర దేవేందర్ పటేల్, పెంట శేఖర్, గూడెపు సారంగ్ పాణి, పాల్గొన్నారు.

## అడవి మంటలపై నిర్వహించిన మాక్ డ్రిల్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.




**ములుగు,మే18(తెలంగాణ వాణి):**
ములుగు జిల్లా తాడ్వాయి డివిజన్ పరిధిలోని తాడ్వాయి టీ రేంజ్,లవ్వల సెక్షన్ దేవునిగుట్ట వెస్ట్ బీట్‌లో అడవి మంటల నిర్వహణపై మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు. సోమవారం ములుగు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అడవి మంటల మాక్ డ్రిల్ ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు,జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాతో కలిసి మాక్ డ్రిల్ తీరును పరిశీలించారు. 39వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ సింగ్ ఠాకూర్ మాక్ డ్రిల్ కు పరిశీలకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అడవి మంటలు సంభవించడానికి గల కారణాలు,వాటిని నివారించే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడవి మంటల వల్ల వన్యప్రాణులు, అటవీ సంపద, పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ఎవరు కూడా ఎట్టి పరిస్థితుల్లో అడవికి నిప్పు అంటించరాదని ఉద్దేశపూర్వకంగా అటవీ ప్రాంతానికి హాని కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విన్యాసంలో భాగంగా సిబ్బంది అడవి మంటలను సురక్షితంగా అదుపు చేసే విధానాలను అడవి ప్రత్యక్షంగా ప్రదర్శించారు. క్విక్ రెస్పాన్స్ టీం బ్లోయర్స్, రేకర్స్, బీటర్స్, ఫైర్ రేక్ వంటి అగ్నిమాపక పరికరాల వినియోగాన్ని వివరించింది. మంటలు వ్యాపించకుండా కౌంటర్ ఫైర్ లైన్లను సృష్టించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, పోలీస్, ఫైర్, వైద్య, రెవెన్యూ,పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



**నిజామాబాద్, మే 18 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు**
కాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజా పాలన సభలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిగేలా పరస్పర సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి:జిల్లా కలెక్టర్




**మంచిర్యాల, మే 18 (తెలంగాణ వాణి):**
ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు చేపట్టిన తెలంగాణ మారథాన్-ఫిజికల్ లిటరసి కార్యక్రమంలో డిసిపి భాస్కర్,గుడిపేట 13వ పటాలము కమాండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, ఎసిపి. ప్రకాష్, యువతీ యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశం యువ భారతదేశం అని, దేశంలో యువ జనాభా అధికంగా ఉందని తెలిపారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిలో యువత అత్యంత కీలకమని, దేశ అభివృద్ధి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఆరోగ్యం, క్రమశిక్షణ కలిగి ఉండాలని, వ్యాయామం, యోగ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని యువత వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత తెలంగాణగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. “నో టు డ్రగ్స్ - ఎస్ టు ఎక్సర్సైజ్” నినాదం దిశగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక రుగ్మత, మానసిక ఆందోళనల నుంచి బయటపడవచ్చు అని, అనారోగ్యం దరిచేరకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం నియామకం



**రామకృష్ణాపూర్, మే 18 (తెలంగాణ వాణి):**
అఖిలభారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ), తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టిపిసిసి) జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ, రామకృష్ణాపూర్ పట్టణంలో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని నియమించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంతో పార్టీని బూత్ స్థాయి నుండి మరింత బలోపేతం చేయడం, యువతకు అవకాశాలు కల్పించడం, సామాజిక వర్గాల సమన్వయంతో పార్టీ నిర్మాణాన్ని విస్తరించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ నూతన కార్యవర్గంలో బీసీ, ఎస్సీ, కార్మిక, యువజన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం కార్యకర్తలే అని, కష్టకాలంలో సైతం పార్టీ జెండాలు మోసిన కార్యకర్తల త్యాగాలు ఎన్నటికీ మరువలేమన్నారు. ప్రజా సమస్యపై పోరాడుతూ, ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకువెళ్లే బాధ్యతను ప్రతి నాయకుడు, కార్యకర్త సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా వొడ్నాల శ్రీనివాస్ కాంగ్రెస్ అధిష్టానం నియమించగా, ఉపాధ్యక్షులుగా ఆకుల రాజయ్య, పనస రాజయ్య, కాసర్ల ప్రకాష్, కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, మంద సృజన, బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా మేకల శ్రీనివాస్, బత్తుల వేణు, గోపు రాజం, మేకల సురేందర్, అరం విద్యాసాగర్ రెడ్డి, ఎర్రబెల్లి రాజేష్, ఎల్పుల సత్యనారాయణ, స్పోక్స్ పర్సన్ గా మాదాసు రాజ్ కుమార్, కార్యదర్శులుగా నర్రా శ్రీనివాస్, పైడాకుల శ్రీనివాస్, కునరపు శివకుమార్, బుర్కల విక్రమ్ గౌడ్, మల్యాల బాలకృష్ణ, గంగారపు సత్యపాల్, గొల్ల మల్లేష్, బైర మల్లేష్, వేణిగళ్ల శ్రీనివాస్ రావు, రాపాక రాజు, కుమ్మరి సాయికృష్ణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పందిళ్ళ కృష్ణ, పోగుల లచ్చులు, కనుకుంట్ల కనకయ్య, నమాని కోటేశ్వరరావు, మీడియా కమ్యూనికేషన్ కన్వీనర్ గా కుర్మ సురేందర్, సోషల్ మీడియా కన్వీనర్ గా బొద్దుల ప్రేమ్ సాగర్ రావు, కో-కన్వీనర్ గుర్రం అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్, సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, మహిళా నాయకురాలు కొండవేణ పుష్ప, కొలిపాక దీప లు పాల్గొన్నారు.

# జిల్లాలో బాల్య వివాహాల నివారణలో విశేష సేవలు అందిస్తున్న పోలీస్ అక్క బృందం.

- పోలీస్ అక్క సిబ్బంది తో సమావేశం ఏర్పాటు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మే : 18 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
బాల్య వివాహాల నిర్మూలనకు ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ రోజు పోలీస్ అక్క సిబ్బంది తో పోలీస్ ముఖ్య కార్యాలయం లో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు పోలీస్ అక్క, షీ టీం బృందాలు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఫిర్యాదులపై తక్షణ స్పందనతో చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో మొత్తం 11 బాల్య వివాహాలను అడ్డుకోగా, అందులో పోలీస్ అక్క బృందం 3, షీ టీం 8 కేసుల్లో కీలక పాత్ర పోషించిందన్నారు. 2026 సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 23 బాల్య వివాహాలను అడ్డుకోగా, పోలీస్ అక్క బృందం 20, షీ టీం 3 కేసుల్లో స్పందించి బాలికల భవిష్యత్తును కాపాడినట్లు తెలిపారు. పాఠశాలలు,



గ్రామాలు, కళాశాలల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ తల్లిదండ్రులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నెల లో పోలీస్ అక్క సిబ్బంది 225 గ్రామాలను సందర్శించి, 207 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 15 ఈ పెట్టి కేసులు నమోదు కావడం జరిగిందని తెలిపారు. పాఠశాలలు, గ్రామాలను సందర్శించి వేధింపులపై మరింత సమాచారం సేకరించాలని, మహిళలు న్యాయం చేయాలని తెలిపారు. ప్రస్తుతం జరుగు నేరాలను తెలిపి చైతన్య పరచడం చేయాలని తెలిపారు. బాల్య వివాహాలపై అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రతి బాలిక విద్యను కొనసాగించి, సురక్షిత భవిష్యత్తు వైపు అడుగులు వేయాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ పనిచేస్తోందని జిల్లా ఎస్పీ తెలిపారు. స్వయంగా సమాచారం అందిస్తున్న పాఠశాల విద్యార్థులు, అది అభినందనీయం అని తెలిపారు. నెల రోజులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అక్క సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ లు బి డి ప్రేమ్ కుమార్, కె ఫణిదర్, షి టీం సిబ్బంది సుశీల,వాణిశ్రీ, లావణ్య, రోహిణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో రణరంగంగా మారిన కారు వర్సెస్ కమలం ధర్నా వివాదం

- పట్టణంలోని నేతన్న చౌరస్తాలో ఉద్రిక్తత
- పరస్పర నినాదాలతో దద్దరిల్లిన నేతన్న చౌరస్తా

**రాజన్న సిరిసిల్ల,మే 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రధాన కూడలి అయిన నేతన్న చౌరస్తా వద్ద బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా ధర్నాకు దిగడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేయడంతో నేతన్న చౌరస్తా ప్రాంతం మొత్తం దద్దరిల్లిపోయింది.?ధర్నా కాస్తా క్రమంగా ముదరడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. పరస్పర వాగ్వాదాలు, తోపులాటలతో మొదలైన వివాదం,చివరికి ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు దిగి కొట్టుకునే స్థాయికి చేరింది.



ఒకవైపు బీఆర్ఎస్ శ్రేణులు ‘బండి సంజయ్ డౌన్ డౌన్’ అంటూ, మరోవైపు బీజేపీ శ్రేణులు ‘కేటీఆర్ డౌన్ డౌన్’ నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య మాట పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. పరిస్థితులు చేతులు దాటుతుండడంతో ఎస్పీ మహేష్ బి.గీతేతో సహా భారీగా పోలీసు బలగాలు రంగంలోకి దిగి



లాఠీ ఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చిన అనంతరం, ఇరు పార్టీలకు చెందిన ముఖ్య నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌరస్తా పరిసర ప్రాంతాల్లో పోలీస్ బలగాలను భారీగా మోహరింపజేశారు.

# వరదల సమయంలో అధికారుల సూచనలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- మున్నేరు వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్,

ఎవాక్యుయేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, మే 18 (తెలంగాణ వాణి)**
వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. వర్షాకాలంలో



సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిఎస్టిడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించి నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా



చర్యలు తీసుకోవచ్చున్నారు. ఖమ్మం జనరల్ ఆస్పత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్సైజ్ చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డిఆర్ఎఫ్ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియాదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఏఎంవిఐ, టీజీ ఎన్పిడిసిఎల్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, మునిసిపల్, రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ సత్వర స్పందన

- ఇద్దరికి తక్షణమే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేత
- కృతజ్ఞతలు తెలియజేసిన దివ్యాంగులు

**రాజన్న సిరిసిల్ల,మే 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
ఇద్దరు దివ్యాంగుల ఇబ్బందులను చూసి చలించిన సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సత్వరమే స్పందించి వారి సమస్యకు పరిష్కారం చూపారు.కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల శ్రీనివాస్, ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన కొమిరె పరశురాములు అనే దివ్యాంగులు సోమవారం ఐడీఓసీకి పని నిమిత్తం వచ్చారు.వారిని చూసిన జిల్లా కలెక్టర్ ఎక్కడి నుంచి వచ్చారు..? ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు.వారు పనులపై బయటికి వెళ్లేందుకు, పనులు చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని గుర్తించి తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ వారికి బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించగా,వారిద్దరికి వెంటనే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, హెల్మెట్ జిల్లా కలెక్టర్ అందజేశారు.తమ సమస్య, ఇబ్బందులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేసిన జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# న్యూయార్క్ నగరంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుతో గుబ్బపు మచ్చేందర్ భేటీ

**నారాయణఖేడ్, మే 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
అమెరికాలోని న్యూయార్క్ నగరంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తన్నీరు హరీష్ రావు గారిని జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు గుబ్బపు మచ్చేందర్ గారు సోమవారం ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా పలు ముఖ్య రాజకీయ, సామాజిక, ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, యువత భవిష్యత్తు, ముఖ్యంగా నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిపై విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు.నారాయణఖేడ్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు, సాగునీటి కొరత, పాడైన రహదారులు, విద్యుత్ ఇబ్బందులు, రైతుల ఆర్థిక కష్టాలు, యువత నిరుద్యోగం, విద్యార్థుల భవిష్యత్తు, మహిళల భద్రత వంటి అనేక అంశాలను హరీష్ రావు గారి దృష్టికి తీసుకువెళ్లారు.ఉపాధి కోసం హైదరాబాద్ మరియు ఇతర నగరాలకు వలస వెళ్తున్న యువత పరిస్థితులపై ప్రత్యేకంగా చర్చిస్తూ, నారాయణఖేడ్‌లోనే పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తే యువత జీవితాల్లో పెద్ద మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు.రైతులు ఎదుర్కొంటున్న పంటల నష్టాలు, ఎరువులు--విత్తనాల సమస్యలు, మార్కెట్ ఇబ్బందులు, భూగర్భ జలాల తగ్గుదల, విద్యుత్ సమస్యలపై కూడా లోతుగా చర్చించారు. ప్రతి గ్రామానికి మెరుగైన తాగునీటి వసతి, ఆరోగ్య సేవలు, విద్యా



అవకాశాలు అందాల్సిన అవసరాన్ని వివరించారు.మహిళల భద్రత, యువతుల రక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మహిళలు భయంలేకుండా జీవించే సమాజ నిర్మాణం కోసం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల పరిస్థితులు, నిరుద్యోగ యువత ఆవేదనలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ ప్రభావం వంటి సామాజిక సమస్యలపై కూడా చర్చించారు. అమెరికాలోని తెలంగాణ ఎన్ఆర్ఐల పాత్ర, స్వదేశ అభివృద్ధికి వారు అందిస్తున్న సహాయం, ముఖ్యంగా నారాయణఖేడ్ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు మరింతగా తోడ్పడాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఎన్ఆర్ఐలను ఒక వేదికపైకి తీసుకువచ్చి విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత, మహిళల సంక్షేమం కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా ఎటిఏ, టిటిఏ, మాట వంటి తెలంగాణకు చెందిన ప్రముఖ ఎన్ఆర్ఐ సంఘాల ప్రతినిధులతో సమావేశమై తెలంగాణ అభివృద్ధి, రైతుల సంక్షేమం, విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజల ఐక్యతపై అభిప్రాయాలు పంచుకున్నారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ వింగ్ సభ్యులతో కలిసి పార్టీ భవిష్యత్ కార్యాచరణ, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం, నారాయణఖేడ్‌లో పార్టీని గ్రామస్థాయి వరకు మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిపారు.ఈ సమావేశంలో మహేష్ తన్నీరు, రామ్ లక్ష్మణ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ రెడ్డి, భాస్కర్, బుచ్చిబాబు, అరవింద్, వినయ్ తదితర తెలంగాణ ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.అనంతరం న్యూయార్క్ నగరంలోని బ్రాడ్వే వీధుల్లో కలిసి నడుస్తూ తెలంగాణ రాజకీయ పరిస్థితులు, నారాయణఖేడ్ ప్రజల ఆశలు, భవిష్యత్ నాయకత్వం మరియు సేవా కార్యక్రమాలపై ఆత్మీయంగా చర్చించారు. అనంతరం కలిసి డిన్నర్‌లో పాల్గొని పలు అంశాలపై స్నేహపూర్వకంగా మాట్లాడుకున్నారు.ఈ సందర్భంగా గుబ్బపు మచ్చేందర్ మాట్లాడుతూ,“నారాయణఖేడ్ ప్రజల అభివృద్ధి, యువత భవిష్యత్తు, రైతుల సంక్షేమం, మహిళల భద్రత మరియు గ్రామీణ ప్రాంతాల పురోగతి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాంఅని తెలిపారు.

# 11 శతాబ్దం నాటి చోళ వారసత్వ సంపద తిరిగి భారత్‌కు



భారతదేశం అద్భుత దౌత్య, సాంస్కృతిక విజయాన్ని సాధించింది. 11వ శతాబ్దానికి చెందిన చారిత్రక 'చోళ రాగి ఫలకాలను' నెదర్లాండ్స్ నుంచి భారత్‌కు విజయవంతంగా తిరిగి తీసుకురానుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో శనివారం జరిగిన ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో ఈ కళాఖండాలను అధికారికంగా తిరిగి అప్పగించారు. ఈ క్రమంలోనే నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. 19వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ అసాధారణమైన రాగి ఫలకాలను జాగ్రత్తగా భద్రపరిచిన లైడెన్ విశ్వవిద్యాలయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్-నెదర్లాండ్స్ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలకు ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలిచింది.

మరోవైపు వారసత్వ సంపదను తిరిగి పొందడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. "ప్రతి భారతీయుడికి ఇది ఒక ఆనందకరమైన క్షణం! 11వ శతాబ్దానికి చెందిన చోళుల రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి భారతదేశానికి తిరిగి రానున్నాయి. ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను. చోళుల రాగి ఫలకాల్లో 21 పెద్ద ఫలకాలు, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై ఎక్కువగా ప్రపంచంలోని అత్యంత అందమైన భాషల్లో ఒకటైన తమిళంలోని రచనలు ఉన్నాయి. ఇవి రాజేంద్ర చోళుడు × తన పూర్వీకులు తండ్రి, మొదటి రాజరాజ చక్రవర్తి చేసిన మౌఖిక వాగ్దానాన్ని అధికారికంగా నెరవేర్చడానికి సంబంధించినవి. అవి చోళుల గొప్పతనాన్ని కూడా చాటిచెబుతాయి. భారతదేశంలో చోళులు, వారి సంస్కృతి, సముద్రయాన పరాక్రమం పట్ల ఎంతో గర్వపడుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు.

ఇవి నెదర్లాండ్స్‌లో లైడెన్ ఫలకాలుగా, భారతదేశంలో అనైమంగళం రాగి ఫలకాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాచీన శాసనాలను తిరిగి తీసుకురావాలని భారత్? 2012 నుంచి అవిశ్రాంతంగా ప్రయత్నిస్తోంది. సుమారు 30 కిలోగ్రాముల బరువున్న ఈ 21 రాగి ఫలకాలు, చోళ సామ్రాజ్య అధికారిక రాజముద్రను కలిగిన ఒక భారీ కంచు ఉంగరంతో ఉంది. ఇది భారత సరిహద్దుల వెలుపల ఆ రాజవంశానికి సంబంధించిన అత్యంత కీలకమైన ఆధారాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఈ గ్రంథాలు సంస్కృతం, తమిళం రెండింటిలోనూ ఉన్నాయి. ఇతర దేశాలు దొంగిలించిన వారసత్వ సంపదను తిరిగి పొందే విషయంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న విజయాలకి ఇది నిదర్శనంగా నిలిచింది. ఇదిలా ఉండగా భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. ఈ మేరకు ఆ దేశ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్ మధ్య చర్చల సందర్భంగా రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర రంగాల్లో కలిపి ఇరు దేశాలు 17 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. చర్చల సందర్భంగా ఇరు దేశాల ప్రధానమంత్రులు పశ్చిమాసియాలో పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్లోబల్ ఎనర్జీ సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు ఆటంకాల వల్ల ఈ ప్రాంతం సహా ప్రపంచంపై పడే తీవ్ర ప్రభావాలపై సమాలోచనలు జరిపారు. హర్మ్యూజ్ జలసంధి నుంచి నౌకాయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ వాణిజ్య ప్రవాహం కొనసాగాలని మోదీ, జెట్టెన్ పిలుపునిచ్చారు. ఎలాంటి నియంత్రణ చర్యలనైనా వ్యతిరేకించాలని, ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు తమ మద్దతును కొనసాగించాలని ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్‌లో తాజా పరిస్థితి, రష్యాతో కొనసాగుతున్న ఘర్షణ, ప్రాంతీయ భద్రతా పరిణామాల గురించి కూడా ఇరువురు నేతలు చర్చించారు. చర్చలు, దౌత్యం ద్వారా ఉక్రెయిన్‌లో శాశ్వతమైన శాంతిని సాధించే ప్రయత్నాలకు మద్దతు కొనసాగించాలని పేర్కొన్నారు. అటు నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో కలిసి ఆదివారం అఫ్సులైట్‌డైక్ డ్యామ్‌ను ప్రధాని మోదీ సందర్శించారు.

# బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాలే టార్గెట్

మెరుగైన వేతనం, బంగారు భవిష్యత్తునిచ్చే బ్లూ కాలర్, గ్రే కాలర్ ఉద్యోగాల కోసం స్వస్థలాల నుంచి వలస వెళ్తున్న భారతీయ మహిళలు, ఫ్రెషర్స్ సంఖ్య గణనీయంగా పెరిగింది. 2025 జనవరి - ఏప్రిల్ నాటితో పోలిస్తే, 2026 జనవరి - ఏప్రిల్‌లో ఈ జాబ్స్ కోసం ఇతర నగరాలకు వలస వెళ్లిన మహిళలు, ఫ్రెషర్స్ సంఖ్య 31.4 శాతం మేర పెరిగింది. స్వస్థలాల్లో (స్థానికంగా) ఉద్యోగాల కోసం మహిళలు, ఫ్రెషర్స్ నుంచి వచ్చే దరఖాస్తుల సంఖ్యలో మాత్రం వృద్ధి రేటు 20.2 శాతమే ఉంది. అంటే స్వస్థలాల్లోని ఉద్యోగ ఖాళీల కంటే సుదూర నగరాల్లోని ఉద్యోగ ఖాళీలకే భారతీయ మహిళలు, ఫ్రెషర్స్ నుంచి ఎక్కువ జాబ్ అప్లికేషన్లు అందుతున్నాయి. ఈవివరాలతో బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల భర్తీ సంస్థ 'వర్క్ ఇండియా' ఒక అధ్యయన నివేదికను విడుదల చేసింది.




### నాడు 65 లక్షల దరఖాస్తులు – నేడు 86 లక్షల దరఖాస్తులు

వర్క్ ఇండియా ప్లాట్‌ఫామ్‌పై 2026 జనవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల కోసం 3.5 కోట్లకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వాటి సమాచారం ఆధారంగానే ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం, స్వస్థలాలకు దూరంగా భారత్‌లోని వివిధ నగరాలలో ఉన్న బ్లూ కాలర్, గ్రే కాలర్ ఉద్యోగాల కోసం 2025 జనవరి - ఏప్రిల్‌లో 65 లక్షల మందే అప్లై చేయగా, 2026 జనవరి - ఏప్రిల్‌లో ఏకంగా 86 లక్షల మంది దరఖాస్తు చేశారు. ఈ లెక్కన దేశంలోని ఒక నగరం నుంచి మరొక నగరానికి వలస వెళ్లి పని చేసే కార్మికుల సంఖ్య అనేది, స్థానిక కార్మికుల సంఖ్య కంటే 1.5 రెట్లు వేగంగా పెరుగుతోంది.

### బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాలంటే?

బ్లూ కాలర్ ఉద్యోగం అంటే శారీరక శ్రమతో కూడినది. ఈ పనులను ఫ్యాక్టరీలు, నిర్మాణ రంగాలు, మైదానాల్లో చేస్తారు. గ్రే కాలర్ ఉద్యోగం అంటే వైట్ కాలర్, బ్లూ కాలర్ రంగాల కలయికతో కూడిన పని. ఆఫీసు పనులతో పాటు శారీరక శ్రమతోనే కూడిన జాబ్స్ ఇందులో భాగంగా ఉంటాయి.

### 'వర్క్ ఇండియా' నివేదికలోని కీలక అంశాలు

వర్క్ ఇండియా ప్లాట్‌ఫామ్‌లోని ప్రతీ నలుగురు ఉద్యోగులలో దాదాపు ఒకరు (24.1 శాతం) ఇప్పుడు(2026 జనవరి - ఏప్రిల్) తమ స్వస్థలం వెలుపల ఉద్యోగ అవకాశాల కోసం చురుగ్గా వెతుకుతున్నారు. ఏడాది క్రితం (2025 జనవరి - ఏప్రిల్) ఈ రకం ఉద్యోగార్థుల సంఖ్య 22.5 శాతమే ఉండేది. సుదూర ప్రాంతాలు, నగరాల్లో బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలు జరిగినా గతంలో మహిళలు చాలా తక్కువగా అప్లై చేసేవారు. పెద్దసంఖ్యలో పురుషులే దరఖాస్తులు సమర్పించేవారు. కానీ ఇప్పుడు సీన్ మారింది. మెరుగైన వేతనమిచ్చే అత్యుత్తమ బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల కోసం స్వస్థలాలను వదిలి వెళ్లేందుకు మహిళలు చొరవ చూపుతున్నారు. ఇది అత్యంత కీలక సానుకూల పరిణామం. ఈ పరిణామం బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల భర్తీలో లింగపరమైన అంతరాన్ని తగ్గించేందుకు దోహదం చేయనుంది.

ఉద్యోగాల మార్కెట్‌లో ఓవరాల్‌గా బ్లూ కాలర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే మొత్తం అభ్యర్థుల సంఖ్య 2026 జనవరి - ఏప్రిల్‌లో సగటున 22.7 శాతం మేర పెరిగింది. ఈ పెరుగుదలను సంఖ్యా పరంగా చూస్తే, స్వస్థలాలను వదిలేసి వేరే నగరాలకు వలస వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్న బ్లూ కాలర్ కార్మికుల సంఖ్య చాలా భారీగా ఉంటుంది.

స్వస్థలాలకు దూరంగా ఇతర ప్రాంతాలు, నగరాల్లోని ఉద్యోగాల కోసం అనుభవజ్ఞులైన ఉద్యోగులు సమర్పించే దరఖాస్తులు 5 శాతం పెరగగా, ఫ్రెషర్స్ దరఖాస్తుల సంఖ్య గణనీయంగా 11 శాతం పెరిగింది.

ఆఫీస్ వర్క్, సేల్స్, హెల్త్ కేర్ వంటి ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు వలస వెళ్లడానికి సుముఖత వ్యక్తం చేసే బ్లూ కాలర్, గ్రే కాలర్ కార్మికుల సంఖ్య ఈ సంవత్సరం పెరిగింది. మెరుగైన వేతనాలు, మంచి పని వాతావరణం కోసమే కార్మికులు స్వస్థలాలను వదిలి వెళ్లేందుకూ సిద్ధపడుతున్నట్లు వర్క్ ఇండియా తెలిపింది. తయారీ, డెలివరీ, డ్రైవింగ్, ఆటోమొబైల్, గృహ కార్మికులు వంటి విభాగాల జాబ్స్ దూర ప్రాంతాల్లో ఉన్నా ఎక్కువ మంది దరఖాస్తులు సమర్పిస్తున్నారు. చాలా దశాబ్దాలుగా భారత ప్రజలు ఈ రకం ఉద్యోగాల కోసమే స్వస్థలాలను వదిలి, దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళు న్నారు.

### టైర్-2 నగరాల్లోనూ అపార అవకాశాలు

భారత్‌లో ఉద్యోగ అవకాశాలు అనేవి సాంప్రదాయ మెట్రో నగరాలకు మించి విస్తరిస్తూనే ఉన్నాయని వర్క్‌ఇండియా నివేదిక తెలిపింది. అహ్మదాబాద్, జైపూర్, కోయంబత్తూర్, ఇండోర్, లఖ్‌నవూ వంటి నగరాల్లో నియామకాలు పెరుగుతున్నాయి. వేతన వ్యత్యాసాలు, పెరుగుతున్న ఇంటి ఖర్చులు, జీవన నాణ్యత వంటి అంశాలకు కార్మికులు ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో మెట్రో నగరాల్లోనే ఎక్కువ జీతాలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు టైర్-2 నగరాల్లోని పరిశ్రమలు, స్టార్టప్‌లు కూడా మెరుగైన, పోటీతత్వంతో కూడిన వేతనాలను ఇస్తున్నాయి. అందువల్లే ఇప్పుడు దేశంలోని టైర్-2 నగరాల్లోని సంస్థలకూ దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.

### మహిళలు, ఫ్రెషర్స్ కూడా రెడీ

"గతంలో వలస అనగానే పురుషులే గుర్తుకొచ్చేవారు. కానీ ఇప్పుడు మహిళలు, ఫ్రెషర్స్ కూడా మెరుగైన జాబ్స్ కోసం వలస బాట పడుతున్నారు. గతంలో మెట్రో నగరాల్లోనే జాబ్ అవకాశాలు ఉండేవి. ఇప్పుడు టైర్ 2 నగరాల్లోనూ భారీ శాలరీలతో ఉద్యోగాలు దొరుకుతున్నాయి. ప్రత్యేకించి బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగ విభాగాల్లో ఈ ట్రెండ్‌ను మేం గుర్తించాం. ఫ్రెషర్స్, మహిళలతో సహా లక్షలాది మంది భారతీయులు ఈ విభాగాల్లో తమ కెరీర్‌ను ఎంచుకుంటున్నారు" అని వర్క్‌ఇండియా సహ వ్యవస్థాపకుడు, సీఈఓ నీలేశ్ దుంగర్వాల్ తెలిపారు.

# బంగాల్‌లో చక్రం తిప్పిన ఆర్ఎస్ఎస్

బంగాల్ ఎన్నికల్లో బీజేపీ తొలిసారిగా అద్భుత విజయాన్ని సాధించింది. రాష్ట్రంలోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకుగానూ అనూహ్యంగా 207 చోట్ల గెలుపుబావుటా ఎగరేసింది. బంగాల్‌లో 2016 ఎన్నికల్లో 3 సీట్లు, 2021 ఎన్నికల్లో 77 సీట్లకు పరిమితమైన కమలదళం ఈసారి మాత్రం ఒంటరిగానే డబుల్ సెంచరీ కొట్టింది. ఈ సూపర్ బంపర్ రిజల్ట్ అంత ఆషామాషీగా రాలేదు. ఈ విజయంలో ఒక్క బీజేపీ శ్రమ మాత్రమే లేదు. ఆ పార్టీ మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు చెందిన సంఘ్ ప్రచారక్‌ల అలుపెరుగని గ్రౌండ్ వర్క్ కూడా ఉంది. ఏమాత్రం మీడియా పబ్లిసిటీని కోరుకోకుండా, అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు నుంచే ఆర్ఎస్ఎస్ చేసిన క్షేత్రస్థాయి పని వల్లే బంగాల్‌లో బీజేపీకి అధికార పీఠం దక్కింది. ఇంతకీ ఆర్ఎస్ఎస్ గ్రౌండ్ వర్క్ ఎలా చేసింది ? హిందూ ఓటర్లలోని ఏయే వర్గాలను ఏవిధంగా ఆకట్టుకుంది ? 2021 బంగాల్ ఎన్నికల ఫలితాల నుంచి బీజేపీ ఏం గ్రహించింది ? 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సీట్లు తగ్గడానికి, ఆర్ఎస్ఎస్‌తో సమన్వయ లోపం ఒక కారణమా ? ఈ కథనంలో తెలుసుకుందాం.

### పెద్దసంఖ్యలో ఆర్ఎస్ఎస్ శాఖల ఏర్పాటు

బంగాల్‌తో ఆర్ఎస్ఎస్ అనుబంధం చాలా పాతది. రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ తొలి శాఖను కోల్‌కతాలో 1939లో ప్రారంభించారు. రాష్ట్రంలో 1977 నుంచి 2011 వరకు దాదాపు 34 ఏళ్ల పాటు కమ్యూనిస్ట్ ప్రభుత్వం బలంగా సాగింది. ఆ టైంలో ఆర్ఎస్ఎస్ బహిరంగంగా రాజకీయ ప్రభావం చూపలేకపోయింది. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో విద్యా సంస్థలు, సేవా కార్యక్రమాలు, గిరిజన ప్రాంతాల్లో గిరిజన కళ్యాణ్ ఆశ్రమాల ద్వారా తన పునాదిని నిశ్శబ్దంగా విస్తరించుకుంటూ వచ్చింది. 2011లో కమ్యూనిస్ట్ పాలన అంతమై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధికారంలోకి వచ్చిన తర్వాత, బంగాల్‌లో ఆర్ఎస్ఎస్ శాఖల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇప్పుడు ఉత్తర, మధ్య, దక్షిణ బంగాల్ ప్రాంతాల్లో దాదాపు 4,500కుపైగా ఆర్ఎస్ఎస్ శాఖలు ఉన్నాయి. రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ శాఖ లేని జిల్లా కానీ, ప్రాంతం కానీ లేదు.

### 2021 ఎన్నికల ఫలితాలతో కనువిప్పు

2021 బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర బీజేపీకి 200 సీట్ల లక్ష్యాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్దేశించారు. కానీ అప్పట్లో పార్టీ 77 సీట్లకు మించి గెలవలేకపోయింది. దీంతో కేవలం రాజకీయ ర్యాలీలు, పత్రికా సమావేశాలతో రాష్ట్ర అధికార పీఠాన్ని కైవసం చేసుకోలేమని బీజేపీ కేంద్ర నాయకత్వం గ్రహించి ఉండొచ్చు. రాష్ట్రంలో అధికారం దక్కాలంటే, తొలుత ప్రజల విశ్వాసాన్ని గెల్చుకోవాలని కమలదళం తెలుసుకుంది. బంగాల్‌లోని మైనారిటీ ఓటు బ్యాంకు మొత్తం మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ వైపే ఉంది. ఇక ఇదే సమయంలో హిందూ వర్గంలోని ప్రధాన వర్గాల మద్దతును సైతం టీఎంసీ పొందుతోంది. బీజేపీ తనదైన శైలిలో కేవలం హిందూ ఓటుబ్యాంకుపైనే ఫోకస్ పెట్టింది. ఈ ప్రయత్నంలో కమలదళానికి ఆర్ఎస్ఎస్ సహాయ సహకారాలను అందించింది.

## కేరళ కొత్త మంత్రివర్గం ఖరారు!




కేరళలో సోమవారం వీడీ సతీశన్ సారథ్యంలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్-యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరేందుకు రంగంసిద్ధమైంది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో వీడీ సతీశన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాంగ్రెస్ నుంచి 12 మంది, ఐయూఎంఎల్ నుంచి ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. అయితే, భాగస్వామ్యపక్షాలతో ఇవాళ జరిగిన చర్చల్లో కేబినెట్ కూర్పుపై స్పష్టత వచ్చినట్లు కానున్న ముఖ్యమంత్రి సతీశన్ తెలిపారు. పార్టీ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితలా, మురళీధరన్, సన్నీ జోసెఫ్‌లు కేబినెట్‌లో చేరనున్నట్లు చెప్పారు. యూడీఎఫ్‌లో కీలక భాగస్వామి అయిన ఐయూఎంఎల్?కు 5 పోర్టుపోలియోలు దక్కాయి. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు సాదిక్ అలీ, వీడీ సతీశన్ కేబినెట్‌లో చేరనున్న ఐదుగురి పేర్లను ప్రకటించారు. సీనియర్ శాసనసభ్యుడు తిరువంచూర్ రాధాకృష్ణన్‌ను అసెంబ్లీ స్పీకర్‌గా, షానిమోల్ ఉస్మాన్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలని కూడా యూడీఎఫ్ నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ సహా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు హాజరుకానున్నారు. వీరితో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ హాజరయ్యే అవకాశం ఉంది.

## రష్యాపై భారీ డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి..



మాస్కో: భారీ సంఖ్యలోని డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడి చేసింది. భారతీయ కార్మికుడితో సహా నలుగురు మరణించారు. మరో ముగ్గురు భారతీయ కార్మికులు, మరి కొందరు గాయపడ్డారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధృవీకరించింది. దాడి జరిగిన ప్రదేశాన్ని అధికారులు సందర్శించారని, గాయపడిన కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించినట్లు తెలిపింది. 'ప్రాణనష్టం పట్ల రాయబార కార్యాలయం సంతాపం వ్యక్తం చేస్తోంది. భారతీయ కార్మికులకు అవసరమైన సహాయం అందించడానికి కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోంది' అని భారత రాయబార కార్యాలయం ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది.

కాగా, ఆదివారం తెల్లవారుజామున రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు ఉక్రెయిన్ పాల్పడింది. రష్యా రాజధాని మాస్కోలోని కొన్ని ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించాయి. 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 1,000కు పైగా ఉక్రేనియన్ డ్రోన్‌లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

మరోవైపు రాజధాని వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్‌లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల వల్ల పలు ప్రాంతాల్లోని నివాస భవనాలు, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నలుగురు మరణించారని, వీరిలో ముగ్గురు మాస్కో ప్రాంతానికి చెందినవారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోని బెల్గోరోడ్ ప్రాంతంలో మరో మరణం నమోదైనట్లు వెల్లడించారు.

## మోదీజీ.. నీట్ పేపర్ లీకేజీపై సమాధానం చెప్పండి



నీట్ పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధాని మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సూచించారు. ఎక్స్ వేదికగా ఆదివారం ఈ అంశంపై రాహుల్ మరోసారి స్పందించారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మోదీ మౌనంగా ఉండటాన్ని ప్రశ్నించారు. గతంలో కూడా పేపర్ లీకైన తర్వాత కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని రాహుల్ ప్రశ్నించారు. "నీట్ 2024 : పేపర్ లీకైంది. పరీక్ష రద్దైంది. మంత్రి మాత్రం రాజీనామా చేయలేదు. సీబీఐ విచారణ జరిగింది. ఒక కమిటీ ఏర్పడింది. నీట్ 2026 : పేపర్ లీకైంది. పరీక్ష రద్దైంది. మంత్రి ఇప్పటికీ రాజీనామా చేయలేదు. ఎప్పట్లాగే సీబీఐ విచారణ జరుపుతోంది. ఇంకో కమిటీ ఏర్పాటైంది. మోదీజీ.. దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది. వాటికి జవాబివ్వండి. వరుసగా పేపర్ లీకేజీలు ఎందుకు జరుగుతున్నాయి..? పరీక్షపై చర్చలో మీరు ఇంకా ఎందుకు మౌనంగా ఉన్నారు..? వరుసగా పేపర్ లీకవుతున్నా సంబంధిత విద్యాశాఖ మంత్రిని ఇంకా ఎందుకు తొలగించడం లేదు" అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలంటూ హ్యాష్?ట్యాగ్ పెట్టారు.

రెండు రోజుల క్రితం కూడా నీట్ పేపర్ లీకేజీపై రాహుల్ స్పందిస్తూ.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, లేదా దీనికి మోదీయే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాదికి సంబంధించి జరిగిన నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరుగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితుల్ని సీబీఐ అరెస్టు చేసింది.



# 'పెద్ది' ట్రైలర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం.. స్పెషల్ అప్‌డేట్ ఇచ్చిన రామ్ చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్దిపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని సృష్టించింది. విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న అంశం పెద్ది ట్రైలర్. ఈ ట్రైలర్ విడుదల కోసం సినీ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సమయంలో చిత్రబృందం మరో భారీ అప్డేట్ ఇచ్చింది. ఇప్పటికే ముంబైలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించిన మేకర్స్, తాజాగా ఈ ఈవెంట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ స్వయంగా ఓ ప్రత్యేక గ్లింప్స్ ద్వారా అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. "ఇప్పటివరకు మీరు పాటలు, గ్లింప్స్ చూశారు.. ఇక ఇప్పుడు అసలు బ్లాస్ట్ చూడబోతున్నారు" అంటూ అభిమానుల్లో ఆసక్తిని పెంచేలా రామ్ చరణ్ సందేశం ఇచ్చారు. ఈ మాటలతో సోషల్ మీడియాలో పెద్ది ట్రైలర్‌పై చర్చలు మరింత పెరిగిపోయాయి. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ వేదికగా ఈ గ్రాండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో అభిమానులు, సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశమున్న ఈ ఈవెంట్‌పై ఇప్పుడు ప్రత్యేక ఆసక్తి నెలకొంది. స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో గ్రామీణ నేపథ్యంలో కనిపించిన చరణ్ లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విజేత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించిన పాటలకు ఇప్పటికే మంచి స్పందన లభించింది. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు ప్రత్యేక బలంగా నిలుస్తుందని చిత్రబృందం భావిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్ విడుదలతో సినిమా అంచనాలు మరింత పెరుగుతాయా? అభిమానులు ఆశిస్తున్న స్థాయిలో ఈ ట్రైలర్ ఉండబోతుందా? అన్న ఆసక్తి ఇప్పుడు అందరిలో కనిపిస్తోంది.

# తెలుగు క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్..!

కన్నడ ముద్దుగుమ్మ, హీరోయిన్ శ్రీలీల గురించి టాలీవుడ్ ప్రేక్షకులకు చెప్పాల్సిన పనిలేదు. ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోల సరసన మెప్పించింది. ఈ ఏడాది పరాశక్తి చిత్రంతో తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ కన్నడభామ ప్రస్తుతం ధనుష్‌కు జంటగా కనిపించనున్నారు. తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇక సినిమాల సంగతి పక్కనపెడితే.. ఈ ముద్దుగుమ్మపై గతంలో రూమర్స్ వినిపించాయి. బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో డేటింగ్‌లో ఉందంటూ వార్తలొచ్చాయి. వినాయక చవితి వేడుకల కోసం ఆమె తన తల్లితో కలిసి ముంబయిలోని కార్తీక్ ఇంటికి వెళ్లడంతో పుకార్లు వైరలయ్యాయి. అదే సమయంలో తనకు డాక్టర్ కోడలు కావాలని కార్తీక్ ఆర్యన్ తల్లి చెప్పడంతో మరింత ఆజ్యం పోసింది. కానీ వీటిపై ఎవరూ కూడా క్లారిటీ ఇవ్వలేదు.

తాజాగా శ్రీలీలపై మరోసారి డేటింగ్ రూమర్స్ సోషల్ మీడియాలో గుప్పుమంటున్నాయి. ఈ సారి ఏకంగా టీమిండియా క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందంటూ కథనాలొస్తున్నాయి. మన తెలుగువాడు, యంగ్ క్రికెటర్‌తో డేటింగ్ చేస్తోందని కథనాలు మొదలయ్యాయి.

ఏడాదిగా రూమర్స్..

శ్రీలీల, తిలక్ వర్మ ప్రేమలో ఉన్నారని గతేడాది నుంచి సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవల వీరిద్దరూ కలిసి కనిపించారని వార్తలు రావడంతో రూమర్స్‌కు మరింత బలం చేకూరుతోంది. దాదాపు ఆరు నెలల క్రితమే శ్రీలీల తన తల్లితో కలిసి తిరుమలను సందర్శించింది. అదే సమయంలో తిలక్ వర్మ కూడా అక్కడే ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా శ్రీలీల, ఆమె తల్లితో పాటు ముంబయి ఇండియన్స్ ఆటగాళ్లతో కలిసి కనిపించడంతో రూమర్స్ మరింత బలపడుతున్నాయి. అయితే తమపై వస్తున్న వార్తలపై ఇప్పటి వరకు ఎవరు కూడా స్పందించలేదు.



# 'త్రికాల'గా వస్తున్న శ్రద్ధాదాస్.. రిలీజ్ డేట్ ఫిక్స్!



భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ 'త్రికాల' మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక--శ్రీనివాస్ నిర్మించారు. చాగంటి ప్రొడక్షన్ ఎల్ఎల్‌బి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతుంది. ఇటీవలి కాలంలో మైథలాజికల్ టచ్‌తో వచ్చిన థ్రిల్లర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో 'త్రికాల'పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన హైక్వాలిటీ వీఎఫ్ఎక్స్ ఈ సినిమాకు ప్రధాన బలం కానుందని చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మాస్టర్ మహేంద్రన్ యాక్షన్ సీక్వెన్స్‌లు, అజయ్ పవర్‌ఫుల్ పాత్ర, శ్రద్ధాదాస్ కొత్త లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ..."ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే శక్తి చుట్టూ 'త్రికాల' కథ తిరుగుతుంది. భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు 'త్రికాల' ఒక కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకం ఉంది" అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ... సరికొత్త కాన్సెప్ట్‌తో, మైథలాజికల్ టచ్‌తో రూపొందిన 'త్రికాల' ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, ఆసక్తి.. వంటి అంశాలు కలిసిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త ఫీలింగ్ ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఈ సినిమాకు హర్షవర్ధన్ రమేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

# రజినీకాంత్ జైలర్ 2లో గెస్ట్ రోల్స్‌లో ఎవరెవరు కనిపించబోతున్నారంటే..?

సూపర్ స్టార్ రజినీకాంత్ క్రేజీ లైనప్‌లో ఒకటి జైలర్ సీక్వెల్ జైలర్ 2 కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడని తెలిసిందే. సీక్వెల్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. జైలర్ 2లో ముత్తువేల్ పాండ్యన్ (తలైవా పాత్ర పేరు) మరింత పవర్ ఫుల్ రోల్‌లో చూపించబోతున్నాడట. నెల్సన్ దిలీప్ కుమార్ మైండ్ బ్లోయింగ్ స్క్రీన్ ప్లే ఐడియా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయనుందని ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్ పార్ట్ ముత్తువేల్ పాండ్యన్ పదవీ విరమణకు ముందు జీవితాన్ని చూపించే ప్రీక్వెల్‌గా ఉండనుండగా.. సెకండాఫ్ పూర్తి స్థాయి సీక్వెల్‌గా రానుందట. జైలర్ 2లో పాపులర్ డైరెక్టర్ కమ్ యాక్టర్ ఎస్ జే సూర్య విలన్‌గా కనిపించబోతున్నాడని సమాచారం. గెస్ట్ అప్పీరియన్స్ రోల్స్‌లో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కనిపించనున్నారని టాక్. ఫస్ట్ పార్టులో విలన్‌గా కనిపించి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన వినాయకన్ ప్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో కనిపించనున్నాడట. ఇక అనిరుధ్ రవిచందర్ అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో మాస్ ఫీస్ట్‌లా జైలర్ 2 ఉండబోతుందన్న వార్తలు ఇప్పుడు అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాయి. తాజా టాక్ ప్రకారం సెప్టెంబర్ 4 నుంచి జైలర్ 2 వేట మొదలు కానుంది.



# వెంకటేశ్ -- త్రివిక్రమ్ సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్

**పాత హిట్ పాటకు రీమిక్స్ ప్లాన్!**

టాలీవుడ్‌లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో హీరో వెంకటేష్- దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కూడా ఒకటి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ కథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు కూడా ప్రధాన ఆకర్షణగా ఉండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో ప్రేక్షకులకు ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇవ్వడానికి చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ గతంలో నటించిన ఓ హిట్ సినిమాలోని పాపులర్ పాటను కొత్తగా రీమిక్స్ చేసి ఈ సినిమాలో ఉపయోగించే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఏ పాటను ఎంపిక చేశారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. సాధారణంగా త్రివిక్రమ్ తన సినిమాల్లో సంగీతం, సంభాషణలు, వినోదం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా అందించడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. దీంతో వెంకటేశ్ పాత సినిమా పాటను కొత్తగా ఎలా చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఇక ఈ సినిమా కేవలం కుటుంబ కథతో మాత్రమే కాకుండా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు ప్రేక్షకులను నవ్వించే కామెడీ ట్రాక్ కూడా కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటేశ్ కామెడీ టైమింగ్‌కు త్రివిక్రమ్ రచన జతకావడంతో మరోసారి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్రివిక్రమ్ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ నుంచి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తి చేసి వేసవి సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. కాగా, వెంకటేశ్ -- త్రివిక్రమ్ అనుబంధం కొత్తది కాదు. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పని చేశారు. ఆ సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వీరిద్దరూ నేరుగా హీరో -- దర్శకుడిగా కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.




Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com